# నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | బుధవారం 11-12-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 116 | పేజీలు: 4 | వెల: రూ.1/-


## నగరంలో అధ్వాన్నంగా చెత్త నిర్వహణ

### అధికారుల పనితీరుపై మండిపడ్డ మేయర్

హైదరాబాద్,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): నగర మేయర్ బొంతు రామ్మోహన్ జీహెచ్ఎంసీ జోనల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లపైన చెత్త వేస్తే అధికారులు ఏం చేస్తున్నారని ఆయన వారిపై మండిపడ్డారు. జోనల్ పరిధిలో చాలా మంది అధికారులు సరిగా పనిచేయడం లేదన్న విషయం తన దృష్టికి వచ్చిందని మేయర్ అన్నారు. అలాంటి అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. నగరంలో కోటి మందికి పైగా జనాభా ఉన్నదనీ.. అందుకుగానూ 20,000 మంది కార్మికులు పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. ఇప్పటికీ 44 లక్షల కుటుంబాలకు డస్ట్‌బిన్స్ ఇచ్చామని, చెత్తను సేకరించడానికి ఆటోలు వెళ్లడం లేదని ఆయన అన్నారు. కొన్ని చోట్ల అయితే 15 రోజులకు ఒక్కసారి కూడా చెత్త సేకరించడం లేదనీ.. దీంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారని మేయర్ అన్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించాలని ఆయన తెలిపారు. ఈ-క్లీన్‌డ్రైవ్ ద్వారా స్థానికంగా ఉన్న సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు. నాలుగు రోజుల పాటు ఈ డ్రైవ్ ఉంటుందన్న మేయర్.. జీహెచ్ఎంసీలోని వింగ్స్ అన్నీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



భూపాలపల్లి జిల్లా పర్యటనలో భాగంగా రెడ్‌క్రాస్ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ తమిళ సై

# నేడు గజ్వేల్‌లో సీఎం కేసీఆర్ పర్యటన

### అత్యాధునిక హార్టి కల్చర్ యూనివర్సిటీకి ప్రారంభోత్సవం
### మహతి ఆడిటోరియం, అధునాతన మార్కెట్‌కు శ్రీకారం
### భారీగా ఏర్పాట్లు చేసిన జిల్లా అధికారులు
### మంత్రి హరీష్ రావు పర్యవేక్షణలో పనులు
### పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు

గజ్వేల్,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి కెసిఆర్ తన సొంత నియోజవకర్గం గజ్వేల్‌లో బుధవారం పర్యటించనున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన అత్యాధునికమైన హార్టికల్చర్, అగ్రికల్చర్ యూనివర్సిటీలను సీఎం కేసీఆర్ స్వయంగా ప్రారంభించనున్నారు. ఈ మేరకు సిఎం రాకను దృష్టిలో పెట్టుకుని పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే కెసిఆర్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయి. ములుగులోని హార్టికల్చర్, అగ్రికల్చర్ యూనివర్సిటీల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. ఈ నెల 11న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించనుండడంతో ఇప్పటికే మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సీఎం ఓఎస్‌డీ ప్రియాంక వర్గీస్, పీసీసీఎఫ్ అధికారి శోభ, కలెక్టర్ వెంకట్రామారెడ్డి, సిద్దిపేట పోలీస్ కమిషనర్ జోయల్ డేవిస్ తదితరులతో కలసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. గజ్వేల్ పట్టణంతో పాటు ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమాల వద్ద పరిశుభ్రత, నీటి సదుపాయం, వైద్య కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. పాసులు ఉన్నవారినే అధికారులు అనుమతించనున్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో పండ్లు, పూలు, కూరగాయలు, మాంసం విక్రయదారులకు ప్రత్యేక పాసులు ఇచ్చి వారికి కేటాయించిన కౌంటర్లలో ఉండేలా చూసుకోవాలని సూచించారు. మహతి ఆడిటోరియంలో ప్రదర్శనలు చేసే కళాకారులకు ప్రత్యేక పాసులు జారీ చేయాలని సూచించారు. ముఖ్య మంత్రి కార్యక్రమం కవరేజీ చేసే జర్నలిస్టులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని అధికారుల ను ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా విద్యుత్తు శాఖ డీఈలు చూడాలన్నారు. భోజన కేంద్రాల వద్ద ఏర్పాట్లను కూడా పర్యవేక్షించాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటనకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ జోయల్‌డేవిస్ తెలిపారు. పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీఎం పర్యటనలో ట్రాఫిక్‌కు, ప్రజలకు, వీవీఐపీలకు ఎలాంటి ఇబ్బందులు బందోబస్తు అధికారులు ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. ఎక్కడా ఇబ్బంది తలెత్తకుండా ఏర్పాట్లు చేశామన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి గజ్వేల్‌లో సీఎం పర్యటనను విజయవంతం చేయాలని ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలో సీఎం ప్రారంభించనున్న సమీకృత మార్కెట్, మహతీ ఆడిటోరియం, సమీకృత ప్రభుత్వ కార్యాలయాల భవన సముదాయాలను మంగళవారం ఆయన కలెక్టర్ వెంకట్రామారెడ్డి, సీపీ జోయల్ డేవిస్, జేసీ పద్మాకర్, డీఆర్వో చంద్రశేఖర్, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాపరెడ్డి, పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ భూపతిరెడ్డి, సీనియర్ నాయకులు ఎలక్షన్‌రెడ్డి, యాదవరెడ్డితో కలసి పరిశీలించారు. ఏర్పాట్లు, బందోబస్తు పై అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మొదట ములుగులో ఫారెస్ట్ కళాశాల, కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవన విశ్వవిద్యాలయం, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌ను ప్రారంభిస్తా రన్నారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ పట్టణంలో సకల సదుపాయాలతో నిర్మించిన సమీకృత మార్కెట్, సమీకృత కార్యాలయ భవన సముదాయం, మహతీ ఆడిటోరియంలను ప్రారంభిస్తారని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి ముఖ్యమంత్రి కార్యక్రమాలు ప్రారంభమవు తాయన్నారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం అధికారులు తమకు కేటాయించిన విధుల్లో ఉండాలన్నారు. సీఎం కేసీఆర్ ఆరు కార్యక్రమాల్లో పాల్గొంటారని, ప్రతి కార్యక్రమాన్ని జిల్లాస్థాయి అధికారి పర్యవేక్షించాలన్నారు. పర్యటన ముగిసే వరకు కార్యక్రమం సాఫీగా జరిగేలా చూడాలన్నారు. గజ్వేల్ పట్టణంలోని సమీకృత మార్కెట్ వద్ద స్టాళ్ల కేటాయింపును అధికారులు ముమ్మరం చేశారు. ఆడిటోరియం వద్ద ఏర్పాట్లను వేగవంతం చేశారు. సమీకృత భవన సముదాయంలోకి గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలను తరలిస్తున్నారు. ఎక్కడికక్కడ శిలఫలకాలను ఏర్పాటు చేస్తున్నారు. మహతీ ఆడిటోరియం వద్ద ప్రముఖంగా ఏర్పాట్లుచేయాలని జిల్లా యంత్రాంగానికి మంత్రి హరీశ్‌రావు ఆదేశాలు జారీచేశారు. పట్టణమంతా స్వాగత తోరణాలు ఏర్పాటు చేయాలని నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులకు సూచించారు. మార్కెట్, ఐవోసీ, ఆడిటోరియంను విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు.

## ఆత్మరక్షణ కోసమే కాల్పులు

**– దిశ ఘటనపై ఎన్‌హెచ్ఆర్‌సీకి పోలీసుల నివేదిక**
**– పోస్ట్ మార్టం రిపోర్ట్, సీసీ పుటేజీలు అందజేత**
**– మరోవైపు దర్యాప్తు వేగవంతంచేసిన సిట్ బృందం**

హైదరాబాద్, డిసెంబర్10 (ఆర్ఎన్ఎ) : దిశ అత్యాచారం, హత్య ఘటనపై నేషనల్ హ్యూమన్‌రైట్స్ కమిషన్(ఎన్‌హెచ్ఆర్‌సీ)కు సైబరాబాద్ పోలీసులు మంగళవారం నివేదిక అందించారు. ఎన్‌కౌంటర్ జరిగిన తీరును ఎన్‌హెచ్ఆర్‌సీ సభ్యులు అడిగి తెలుసుకున్నారు. నిందితులు తమపై దాడిచేసిన తీరును పోలీసులు బృందానికి వివరించారు. ఒక్కసారిగా కర్రలతో, రాళ్లతో తమపై దాడిచేసి రివాల్వర్లు లాక్కున్నారన్నారు. కొంతదూరం వెళ్లాక నిందితులు కాల్పులకు తెగబడ్డారని, గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆత్మరక్షణ కోసమే కాల్పులు జరిపామని పోలీసులు వెల్లడించారు. దిశ అపహరణ, అత్యాచారం, మృతదేహం కాల్చివేతపై ఫోరెన్సిక్ ఆధారాలతో నివేదిక అందజేశారు. రక్తపు మరకల డీఎన్ఏ రిపోర్ట్‌తో పాటు అన్ని నివేదికలు పోలీసులు అందించారు. ఘటనా స్థలంతో పాటు లారీ తిరిగిన సీసీ పుటేజీని, కొత్తూరులో పెట్రోల్ కొనుగోలు చేసిన సీసీ పుటేజీలు అందించారు. ఇదిలాఉంటే ఇప్పటికే ఎన్‌హెచ్ఆర్‌సీ బృందం తమ విచారణను వేగవంతం చేసింది. నాలుగు రోజులుగా హైదరాబాద్‌లోనే ఉన్న ఎన్‌హెచ్ఆర్‌సీ బృందం.. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తోంది. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులను పిలిపించి వివరాలు తెలుసుకుంది. ఆ రోజు అసలేం జరిగింది? నిందితులు ఎలా దాడి చేశారు? పోలీసులు ప్రతిఘటించడానికి ఏం చేశారనే వివరాలు నమోదు చేసుకుంది. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులను విచారించిన తరువాత.. జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులు ఎన్‌కౌంటర్‌కు ముందు గాయపడ్డ పోలీస్ అధికారుల దగ్గరికి వెళ్లింది. వారి వాంగ్మూలం కూడా నమోదు చేసింది. వారికి చికిత్స అందిస్తున్న వైద్యుల నుంచి కూడా వివరాలు సేకరించారు ఎన్‌హెచ్ఆర్సీ సభ్యులు. దిశ హత్య నుంచి ఎన్‌కౌంటర్ వరకు అన్ని విషయాల్ని రికార్డ్ చేసుకున్నారు. అలాగే ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన నిందితులకు పంచనామా చేసిన రెవెన్యూ అధికారులను కూడా మానవ హక్కుల కమిషన్ ప్రశ్నించింది. పంచనామాలో రాసిన ప్రాథమిక వివరాలపైనా ఆరా తీసింది. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశానికి వెళ్లిన క్లూస్ టీమ్.. వివరాలు సేకరించింది. 3ఆ స్కానర్లలో ఎన్‌కౌంటర్ జరిగిన స్థలాన్ని చిత్రీకరించింది.

### సిట్ దర్యాప్తు వేగవంతం..

మరోవైపు దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై ఏర్పాటైన సిట్ కూడా దర్యాప్తు ముమ్మరం చేసింది. సోమవారం రాచకొండ సీపీ మహేశ్ భగవత్ సిట్ సభ్యులతో సమావేశమయ్యారు. కాగా బుధవారం ఇంటరాగేషన్‌లో భాగంగా ఎన్‌కౌంటర్ ప్రదేశాన్ని సిట్ బృందం పరిశీలించారు. న్‌కౌంటర్‌కు దారితీసిన పరిస్థితులు, సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేస్తున్న సమయంలో ఏం జరిగిందనే దానిపై వివరాలు సేకరించారు. ఎన్‌కౌంటర్ తర్వాత ఆధారాలు సేకరించిన అధికారులతో పాటు పంచనామా చేసిన అధికారులను కూడా విచారించారు. షాద్‌నగర్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కూడా పరిశీలించి, చటాన్‌పల్లి ఎన్‌కౌంటర్ జరిగిన తీరు... దానికి దారితీసిన పరిస్థితులపై సిట్ దర్యాప్తు చేసి కోర్టుకు నివేదిక సమర్పించనుంది.

# ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి సమిష్టి కృషి

### తలసేమియా పరిశోధన కేంద్రం ఏర్పాటుకు కృషి
### ఆరోగ్యశ్రీ ఎంపానెల్‌మెంట్ లో చేర్చడంపై హర్షం
### రెడ్‌క్రాస్ సొసైటీ కార్యక్రమంలో గవర్నర్ తమిళ సై
### వరంగల్‌లో గవర్నర్‌కు ఘనంగా స్వాగతం

వరంగల్,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి సమిష్టిగా కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందర్య రాజన్ పిలుపునిచ్చారు. సోమవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వరంగల్ అర్బన్ శాఖ వారి ఆధ్వర్యంలో జూనియర్, యూత్ రెడ్ క్రాస్ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశానికి గవర్నర్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ జిల్లాలో తలసేమియా పరిశోధన కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. రెడ్ క్రాస్ సెంటర్లో డెంగ్యూ ప్లేట్‌లెట్స్ కౌంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. క్లాస్ లో బ్లడ్ బ్యాంక్, తలసేమియా వ్యాధులకు మెరుగైన చికిత్స అందించడంతోపాటు తగినన్ని పరికరాలు, సౌకర్యాలు ఉండడం గొప్ప విషయమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తలసేమియా వ్యాధి ను ఆరోగ్యశ్రీ ఎంపానెల్‌మెంట్ లో చేర్చడంపై హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ఇన్సూరెన్స్ స్కీములు అయినా ఆరోగ్యశ్రీ. ఆయుష్మాన్భవ పథకాల ద్వారా పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అంది అందించవచ్చని , ఆ దిశగా కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ సొసైటీ లాభం నష్టం లేకుండా చారిటబుల్ గా నడిచే సంస్థ అని, ఈ సొసైటీ ద్వారా అందిస్తున్న మెరుగైన సేవల పట్ల గవర్నర్ సంతృప్తి వ్యక్తం: చేసారు. అంకితభావాన్ని కొనసాగిస్తూ సేవలు అందించాలని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ ద్వారా తలసేమియా, బోన్ మ్యారో చికిత్సకు అవకాశముందని ఈ సందర్భంగా ఆమె చెప్పారు. రోగులకు తక్కువ ధరకు మందులు అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జన ఔషధీ ఈరోజు ప్రారంభించడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 9 జన ఔషధీ మందుల షాపులు విజయవంతంగా నిర్వహించడంపై రెడ్ క్రాస్ సొసైటీ వారికి అభినందించారు.

రంగల్ అర్బన్ జిల్లా వ్యాప్తంగా నవంబర్ 1వ తేదీ వరకు పదివేల మంది జూనియర్, యూత్ రెడ్‌క్రాస్ సభ్యులు ఉండగా గవర్నర్ పిలుపు మేరకు నవంబర్ 1 నుండి ఇప్పటివరకు లక్ష 16 వేల 718 మంది నభ్యులుగా చేరడం అభినందనీయమని, రాష్ట్ర వ్యాప్తంగా పది లక్షల మంది ఇప్పటి వరకు సభ్యులుగా చేరారని, ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లి అధికంగా నభ్యులను నవోదు చేయాలన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా అందించే సేవలు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నాయని అన్నారు. సమాజంలో జూనియర్, యువ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు పిల్లలకు లీడర్లు అని కొనియాడారు. సమాజంలో రక్త సేకరణ ఆవశ్యకతను ప్రజలలో అవగాహన కల్పించి, రక్తం డొనేషన్ చేసేలా చైతన్యం కల్పించాలన్నారు.

జిల్లా కలెక్టర్ , ఇండియన్ రెడ్ క్లాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు ప్రశాంత్ జీవన్ పాటిల్ మాట్లాడుతూ రాష్ట్ర గవర్నర్ చొరవ వల్ల తలసేమియా వ్యాధిని ఆరోగ్యశ్రీలో చేర్చడం, ఉత్తర్వులు జారీ చేయడం పట్ల గవర్నర్ కు ధన్యవాదాలు తెలిపారు. దీనివల్ల రాష్ట్ర వ్యాప్తంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందుతాయన్నారు. తలసేమియా వ్యాధి గ్రస్తులకు పెన్షన్ మంజూరు కొరకు చర్యలు తీసుకోవడం, పేద తలసేమియా పేషంట్స్ కు పెద్ద ఊరట అని అన్నారు. హైదరాబాదులో డెంగ్యూ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేయడం పట్ల గవర్నర్ కు కృతజ్ఞతలు తెలుపుతూ వరంగల్ లో కూడా తలసేమియా రీసెర్చ్ సెంటర్ మంజూరు చేయాలని కోరారు. ఐ ఆర్ సి ఎస్ సెంటర్ ద్వారా జిల్లాలోని 280 తలసేమియా పేషంట్స్ కు మెరుగైన చికిత్సలు నాలుగు నంవత్సరాలు అందించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా 5013 బ్లడ్ క్లాస్ రిజల్స్ చేయడం జరిగిందన్నారు. గత సంవత్సరం 11858 యూనిట్ల రక్తం సేకరించి 11585 మంది రోగులకు స్థానాన్ని అందించడం జరిగిందన్నారు. క్రాస్ సొసైటీలో ప్లేట్‌లెట్స్ కౌంట్ యంత్రాన్ని చేసి తక్కువ ధరకు ఇట్లు చేయడం జరుగుతుందన్నారు.

చ్చే సంవత్సరం ఐ ఆర్ సి ఎస్ వరంగల్ బ్రాంచ్ ద్వారా మెరుగైన సేవలు అందిస్తామని కలెక్టర్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఇ÷డ్ క్రాస్ సొసైటీ వరంగల్ శాఖ చైర్మన్ విజయ్ చందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 10 లక్షల మంది విద్యార్థులు జూనియర్, యూత్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు కాగా, కేవలం వరంగల్ జిల్లా నుండే లక్ష 16 వేల పై చిలుకు మంది విద్యార్థులు సభ్యులుగా నమోదు చేయడం జరిగిందన్నారు. దీని గాను జిల్లా కలెక్టర్ గారి సూచనల మేరకు నవంబర్ 1వ తేదీ నుండి జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, లలో కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులను బ్లడ్ డొనేషన్ పట్ల అవగాహన కల్పించి నభ్యులుగా నవోదు చేయడం జరిగిందన్నారు. డిసెంబర్ మాసంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అత్యధికంగా నభ్యులుగా నవోదు చేయడం జరుగుతుందని చెప్పారు. వచ్చే సంవత్సరం జనవరి నుండి ప్రణాళికాబద్ధంగా రెడ్ క్రాస్ ద్వారా జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సంస్థ ద్వారా నిర్వహించే రక్త సేకరణ, వాహనాల నిర్వహణ, పరికరాల కొనుగోలు మొదలగు వాటిపై జీఎస్టీ నిర్వహించుటకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా గవర్నర్ను కోరారు.

ఈ కార్యక్రమాల్లో గవర్నర్ కార్యదర్శి, తిసఇఃబ వైస్ ప్రెసిడెంట్ సురేంద్రమోహన్, ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డి,

వరంగల్ నగర కమిషనర్ డాక్టర్ రవీందర్, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, అసిస్టెంట్ కలెక్టర్ మను చౌదరి, తిసఇఃబ వరంగల్ బ్రాంచ్ జనరల్ సెక్రెటరీ ఈ వి శ్రీనివాసరావు, ఐ ఆర్ సి ఎస్ సభ్యులు, అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అంతకుముందు ఐఆర్‌సిస్ వరంగల్ శాఖ ద్వారా ఏర్పాటు చేసిన ఇండియన్ రెడ్ క్రాస్ పతాకాన్ని గవర్నర్ ఆవిష్కరించారు. సికిల్ సెల్‌ను, జనరిక్ మందుల షాపును, బ్లడ్ బ్యాంకు ను పరిశీలించి రక్తదానం చేసిన దానం చేసిన వారికి వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. భవన అదనపు గదుల నిమిత్తం 3.7 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టే పనులకు గవర్నర్, శంకుస్థాపన చేశారు. అనంతరం వెయ్యి స్తంభాల , భద్రకాళి దేవాలయాలను సందర్శించి పూజలు నిర్వహించారు. తదుపరి ఖిలా వరంగల్ లో కాకతీయ కట్టడాలను సందర్శించారు. అంతకుముందు వరంగల్ చేరుకున్న తమిళ సైకి మంత్రులు సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి, ఎంపి మసునూరి దయాకర్, కలెక్టర్, కమిషనర్‌లు ఘనంగా స్వాగతం పలికారు.

### నేడు రాజ్యసభలో..

# పౌరసత్వ సవరణ బిల్లు

**– ఆమోదం పొందుతుందనే ధీమాతో బీజేపీ**
**– 123 సభ్యుల మద్దతుకై ప్రయత్నాలు**

న్యూఢిల్లీ, డిసెంబర్10(ఆర్ఎన్ఎ) : వివాదాస్పద పౌరసత్వ సవరణ బిల్లు (2019)కు లోక్‌సభ ఆమోద ముద్ర వేయడంతో రాజ్యసభలో ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం సమాయత్తమవుతోంది.

రాజ్యసభలో ఈ బిల్లును బుధవారం ప్రవేశపెట్టనుంది. పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్‌ల్లో మతపరమైన వేధింపులు ఎదుర్కొనే ముస్లిమేతరలు భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకుంటే ఆమోదించడానికి ఈ బిల్లు వీలు కల్పిస్తుంది.

ఈ మూడు దేశాలకు చెందిన హిందవులు, క్రైస్తవులు, పార్శీలు, జైనులు, బౌద్ధులు, సిక్కులు ఈ పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. సరైన ట్రావెల్ డాక్యుమెంట్లు, ఇతర పత్రాలు లేకపోయినా వీరు 2014 డిసెంబర్ 31లేదా అంతకు ముందు భారత్‌కు వచ్చిఉండాలి.

బిల్లుపై సోమవారం లోక్‌సభలో సుమారు 12 గంటల పాటు వాదోపవాదాలు, విమర్శలు, ఆరోపణలతో జరిగిన చర్చానంతరం అర్ధరాత్రి దాటిన తర్వాత ఓటింగ్ చేపట్టారు. బిల్లుకు అనుకూలంగా 311 ఓట్లు పడగా, వ్యతిరేకంగా 80 మంది ఓటేశారు. దీంతో బిల్లుకు లోక్‌సభ ఆమోదం లభించింది. కాగా ఈ బిల్లు రాజ్యసభలో సైతం ఆమోదం పొందాల్సి ఉంటుంది.

బిల్లుకు ఆమోదం లభించాలంటే 245 మంది సభ్యుల రాజ్యసభలో కనీసం 123మంది సభ్యులు మద్దతివ్వాల్సి ఉంటుంది.

అయితే రాజ్యసభలో మాత్రం కొన్ని ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం కన్పిస్తోంది. అయితే ఆర్టికల్ 370 రద్దు మాదిరిగానే.. ఇప్పుడు కూడా ప్రాంతీయ పార్టీల మద్దతుతో రాజ్యసభలో బిల్లును ఆమోదింపజేసుకోవాలని భాజపా యోచనలో ఉంది.

### ఎగువ సభలోనూ ఆమోదం పొందుతుంది – జీవీఎల్ నరసింహారావు

దేశ ప్రజల హితం కోసం తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ బిల్లు పెద్దల సభలోనూ ఆమోదం పొందుతుందని భాజపా రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు విశ్వాసం వ్యక్తం చేశారు.

పలు ప్రాంతీయ పార్టీలు ఈ బిల్లుకు మద్దతిస్తున్నాయని తెలిపారు. అయితే కొన్ని పార్టీలు స్థానికంగా తమ ఓటు బ్యాంకును కాపాడుకోవడం కోసం, రాజకీయ ప్రయోజనాల కోసం బిల్లును వ్యతిరేకిస్తున్నాయని విమర్శించారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తీసుకొచ్చే ప్రతి బిల్లును కాంగ్రెస్ వ్యతిరేకిస్తూనే ఉందని జీవీఎల్ ఆరోపించారు.

# గ్రీన్ ఇండియా ఛాలెంజ్ స్వీకరించిన ఎమ్మెల్యే లింగయ్య



నకిరేకల్ , డిసెంబర్ 10గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య స్వీకరించి మొక్కలు నాటారు. టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యులుజోగినపల్లి సంతోష్ కుమార్ జన్మదినం సందర్భంగా తుంగతుర్తి శాసనసభ్యులు గాదరి కిషోర్ కుమార్ గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌ను స్వీకరించి నార్కట్ పల్లి పట్టణ కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటి, మరో ముగ్గురు విద్యుత్ శాఖ మంత్రి గుంతకండ్ల జగదీష్ రెడ్డి, ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య లకు గ్రీన్ ఛాలెంజ్ విసిరారు.

### గడ్డి అన్నారంలో అధికారుల పర్యటన

హైదరాబాద్,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ గడ్డి అన్నారం పండ్ల మార్కెట్‌ను నీతి ఆయోగ్, ఐటీ అధికారులు సందర్శించారు. మార్కెట్ లో క్రయవిక్రయాలు జరుగుతున్న తీరును రైతులు, వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్‌లో వేలం నిర్వహణ తీరుపై చర్చించిన అధికారులు.. అన్ని విభాగాలను ఐటీతో అనుసంధానం చేసేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ రామ నర్సింహా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మెట్రో రైళ్లో ఇంటర్‌నెట్ లేకుండా సినిమా చూడొచ్చు...

హైదరాబాద్, డిసెంబర్ 10: మెట్రోరైళ్లో జీ5 మొబైల్ అప్లికేషన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. షుగర్‌బాక్స్ నెట్‌వర్క్‌తో ఇంటర్‌నెట్ లేకుండానే వీడియోలు చూసే అవకాశం ఉంటుంది. దీనికి సంబంధించిన ఒప్పందంపై రెండు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. మెట్రోలో షుగర్ బాక్స్ నెట్‌వర్క్‌ను ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ప్రారంభించారు. ఫ్రిప్లే యాప్‌తో ఇంటర్‌నెట్ లేకుండానే సినిమాలు, వీడియోలు చూసే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు.మొదటగా 10 మెట్రోస్టేషన్‌లలో షుగర్‌బాక్స్, మెట్రోలోకల్ వైఫై సేవలు అందిస్తున్నారు. త్వరలోనే మరిన్ని స్టేషన్లను అందుబాటులోకి తీసుకొస్తాం. వినోదం, మేథోసంపత్తిని పెంచే పుస్తకాలు ఉంచాలని కోరాం. ఫ్రిపే యాప్‌తో 3 నిమిషాల్లో సినిమాను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మెట్రో స్టేషన్‌లో ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని వెల్లడించారు.అనంతరం షుగర్‌బాక్స్ సీఈవో రోహిత్ మాట్లాడుతూ...ఈ సర్వీసును 60 రోజుల పాటు ఉచితంగా అందిస్తాం. తర్వాత ప్రీమియం ఛార్జీలు వసూలు చేస్తాం. ప్రతిరోజు మెట్రోలో ప్రయాణించే వారికి ఎంతో ఉపయోగంగా ఉంటుంది. గేమింగ్, ఫుడ్, ఈ కామర్స్, ఈ లర్నింగ్ లాంటివి కూడా అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

### చిలీ విమానం అదృశ్యం

న్యూఢిల్లీ,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): చిలీ దేశ వైమానిక దళానికి చెందిన విమానం అదృశ్యమైంది. 38 మందితో వెళ్తున్న కార్గో సైనిక విమానం ఆచూకీ లేకుండ ఆపోయింది. అంటార్కిటికా వెళ్తున్నరూట్లో ఆ విమానం కనిపించకుండాపోయిందని ఆ దేశ ఎయిర్‌ఫోర్స్ ఓ ప్రకటనలో పేర్కొన్నది. సీ-130 హెర్క్యుల్స్ ట్రాన్స్‌పోర్టు ఎయిర్‌క్రాఫ్ట్ స్థానిక కాలమానం ప్రకారం ఉదయం ఆరు గంటలకు విమానం మిస్సైంది. పుంటా ఏరినాస్ నగరం నుంచి టేకాఫ్ తీసుకున్న తర్వాత అది ఆచూకీలేదు. విమానంలో 17 మంది సిబ్బంది, 21 మంది ప్రయాణికులు ఉన్నారు. మిస్సైన విమానం గురించి రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది.

### చరిత్రలో నేటినిజం



కం॥ ముందుగ శతమతులను-నే
నందించుచు గొలుచుచుంటి నానందముతో
వందన మొసగుచు తెలుగున
సుందర మునివట్టి ఆ భారత సుబ్రహ్మణ్యన్ !!



(డిసెంబర్ 11 తమిళకవి సుబ్రహ్మణ్య భారతిజననం)

–రాధశ్రీ
సెల్: 9494481210

# కొంటే మాత్రం ఆ సంచుల నిషేదం వర్తించదా..?

నేటి నిజం
బుధవారం 11-12-2019

ఇటీవల కాలంలో ప్రతి ఆహారం విషా రసాయనాలతో సంకరం అయిపోతుందన్నది ప్రజలు పట్టించుకుంటున్న వ్యవహారం. పర్యావరణం ప్రకృతి ప్లాస్టిక్ తో సంకరమైపోతున్నది ప్రజలు పెద్దగా పట్టించుకోని విషయం. కూరగాయలను ఉప్పునీటితో కడిగి శుభ్రం చేసుకుంటే తప్ప వాటిని వండరాదన్నది పెరిగిన విజ్ఞానం. ఆ కూరగాయలను తీసుకుని వచ్చిన ప్లాస్టిక్ సంచులను మాత్రం చెత్తకుండీలో పారేస్తున్నాము. చెత్తను నింపిన ప్లాస్టిక్ సంచులను మాత్రమే లేదా ప్లాస్టిక్ సంచుల్లో నిండిన చెత్తను మాత్రమే బయట వుంచిన బుట్టలలో వేయండి అని పారిశుద్ధ్య నిర్వాహకులు సలహాలు ఇస్తున్నారు కూడా. ప్లాష్టిక్ సంచిలో నిక్షిప్తం చేయకుండా చెత్తను నేరుగా తెచ్చి బుట్టలో వేసినట్టయితే తాము దాన్ని తీసుకొనిపోమని నగరాలలో అక్కడక్కడ కొందరు నిర్వాహకులు గృహస్థులను బెదిరించారుట. అదేంటని ప్రశ్నిస్తే మీరెంత అజ్ఞానులు అన్న భావంతో నిర్వాహకులు నిరసించిన సందర్భాలు లేకపోలేదు. హైదరాబాద్‌లో మాత్రమే కాదు దేశంలోని దాదాపు అన్ని నగరాల్లోనూ ఎప్పుడో అపుడు ప్లాస్టిక్ సంచులను స్థానిక ప్రభుత్వాలు, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేదించి ఉండటం చరిత్ర. ముంబయిలో 2001లో ఇలా నిషేదించినపుడు అధికారులు అనేక రోజుల పాటు దుకాణాలపై నిఘావేసి ప్లాస్టిక్ సంచులను వాడిన దుకాణాల వారిని భారీ జరిమానాలతో శిక్షించినట్టు చరిత్ర. కొన్నాళ్ళు హైదరాబాద్‌లో కూడా ప్లాస్టిక్ నిషేదం హడావిడిని సృష్టించింది. కానీ తర్వాత ఏమి జరిగింది? ప్లాస్టిక్ సంచులు మేము వాడరాదు. గవర్నమెంటోళ్ళు పట్టుకుని పోతారట అని కూరగాయలు, ఆకుకూరలు అమ్మే మహిళలు స్పష్టీకరించారు.

అందువల్ల వినియోగదారులు కొన్ని వస్తువులను ఇళ్ళకు తీసుకొని పోవడానికి ఎవరి సంచులు వారే తెచ్చుకోవాలి. తెచ్చుకోని వారు తేవడం మరచిపోయిన వారు ఏమి చేయాలి? రెండు మూడు రూపాయలు పెట్టి ప్లాస్టిక్ సంచులను ఆ దుకాణంలోనేకొనాలి. ప్లాస్టిక్ నిషేధం వల్ల జరుగుతున్న తక్షణ పరిణామం అది. సంచులను కొనడం వినియోగదారులకు జరిగిన లాభం. అదేమిట ప్లాస్టిక్ నిషేదించారు కదా? డబ్బు పెట్టి కొంటే మాత్రం ఆ సంచుల నిషేదం వర్తించదా? అనే ప్రశ్నకు సమాధానం మైక్రాన్ ల విజ్ఞానం! పది 'మైక్రాన్ మందం ఉన్న ఇరవై మైక్రాన్‌ల మందం ఉన్న ప్లాస్టిక్ సంచులను వాడటం మాత్రమే పాలకు నిషేధించారట. అంతకు మించిన 'మైక్రాన్ల' మందం ఉన్న పెద్ద పెద్ద సంచులను యధాపూర్వకంగా వాడుకోవచ్చున్నది వినియోగదారులకు తెలియవచ్చిన విజ్ఞానం. ప్లాస్టిక్‌తో పర్యావరణం గాయపడింది. ప్రకృతి క్షతగాత్రమయింది. తిన్న తిండిని జీర్ణించుకోవడం ఆరోగ్యవంతుల లక్షణం. జీర్ణం కాని తిండి రోగాలకు హేతువు అన్న జీర్ణం అవతుంది కానీ మానవుల పొట్టలోకి చేరిన రాళ్ళు, రప్పలు, మేకులు, గాజుపెంకులు ఎలా జీర్ణం అవుతాయి? విలీనం కానిది ప్లాస్టిక్ పదార్థం మాత్రమే. అందువల్ల ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకొనిపోతున్నాయి. ప్రకృతి జీర్ణించుకోలేకపోతోంది. ఈ విషయాన్ని కూడా ప్రభుత్వం కాస్త పట్టుపడితే మనుష్యులు, జంతువులు కూడా అనేక అనారోగ్యాల బారినుండి తప్పించుకోవచ్చు.

## చిత్తవుతున్న పత్తిరైతులు

### తేమ పేరుతో అధికారుల తిరస్కరణ

### దిక్కులేక దళారులను ఆశ్రయిస్తున్న రైతన్న

హైదరాబాద్,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): ఎన్నిచర్యలు తీసుకున్నా,అధికారులు పర్యవేక్షిస్తున్నా పత్తి రైతుకు దళారుల బెడద తప్పడం లేదు. సీసీఐ కొనుగోలు కేంద్రం అధికారులు నిబంధనల పేరిట ఇబ్బందులు పెడుతుండటంతో గత్యంతరం లేని రైతులు మధ్య దళారులకే విక్రయిస్తున్నారు. సిసిఐ నిబంధలను పత్తి రైతులను పంట అమ్ముకునేలా చేస్తోంది. దీంతో పత్తి రైతు దిగులు చెందుతున్నాడు. అకాల వర్షాలతో పంట దెబ్బతిని దిగుబడి తగ్గిందని ఓ వైపు ఆందోళన చెందుతుంటే మరోవైపు పంట కొనుగోళ్లు లేక కలవరపడుతున్నాడు. నిబంధనల పేరిట ప్రభుత్వరంగ సంస్థలు ఇబ్బంది పెడుతుంటే.. దళారులు ధర తగ్గించి పంట కొనుగోలు చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో జిల్లాల్లో దళారులది ఆడిందే ఆటగా మారింది. ప్రధానంగా కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ ఉమ్మడి జిల్లాల్లో పత్తిని ఎక్కువగా పండిస్తారు. ఈ ఏడాది జిల్లాల్లో వేల హెక్టార్లలో రైతులు పత్తి పంట సాగు చేశారు. వ్యవసాయ అధికారుల అంచనా ప్రకారం లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని భావించారు. మొదట్లో పంట బాగానే ఉన్నా అకాల వర్షాల వల్ల పంట కొంత దెబ్బతింది. ఎడతెరపి లేకుండా 15 రోజుల పాటు వర్షం కురియడంతో పంట చేలల్లోనే నీరు నిలువగా, కొన్ని చోట్ల పత్తి నల్లబారింది. దీంతో లక్ష క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపారు.క్వింటాల్ పత్తికి రూ.5,550గా ప్రభుత్వం ధర నిర్ణయించింది. పత్తి కొనుగోలులో అవకతవకలు జరుగకుండా ఉండాలనే ఆలోచనతో పత్తి సాగు చేసిన రైతులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులను కూడా జారీ చేశారు. మధ్య దళారులు రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి సీసీఐలో ఎక్కువ ధరకు అమ్ముకోకుండా ఉండాలనే ఆలోచనతో కొనుగోలు కేంద్రం వద్ద సీసీ కెమెరాలు అమర్చడంతో పాటు అమ్మకానికి వచ్చిన రైతు ఆధార్ కార్డును సరిచూసి, ఐరిష్ కెమెరా ద్వారా వివరాలు సరిచూసి, వేలి ముద్ర తీసుకుని కొనుగోలు చేయాలని ఆదేశాలు వచ్చాయి.తక్‌పట్టీపై కూడా రైతు ఫొటో ఉండేలా చూసుకోవాలని సూచించారు. అయినా తేమశాతం పేరుతో తిప్పిపంపడంతో రైతులు పత్తి అమ్మకాలు జరుగక ఇబ్బందులు పడుతున్నారు. అయితే అధికారులు నిబంధనలు పెట్టడంతో ఇప్పుడు పల్లెల్లోకి దళారులు వచ్చి నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు.

క్వింటాల్‌కు రూ.3500 నుంచి రూ.4 వేలు పెడుతూ కొనుగోలు చేస్తున్నారు. ఇందులో కూడా కొందరు తూకంలో మోసానికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పల్లెల్లో ఇలా ఏ గ్రామానికి వెళ్లినా మధ్య దళారులు ఇలా రైతుల ఇంటికి వెళ్లి తక్కువ ధరకే నేరుగా పత్తి పంట కొనుగోలు చేస్తున్నారు. ఇదంతా జరుగుతున్నా వ్యవసాయాధికారులుగానీ, మార్కెటింగ్ అధికారులుగానీ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇకనైనా అధికారులు, నాయకులు చొరవ తీసుకుని పత్తి రైతును ఆదుకునేలా చర్యలు చేపట్టి మద్దతు ధర వచ్చేలా చొరవ తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## నెట్టింట్లో ఉల్లిగడ్డల జోకులు

### వస్తువుల అమ్మకాలకు ఉల్లిగడ్డల ఆఫర్

### బంగారం కన్నా ఉల్లి ధరలే ఎక్కువంటూ సెటైర్లు

హైదరాబాద్,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): ఉల్లి ధరలు ఆకాశానికి ఎగబాకడంతో ఇప్పుడు వ్యాపారులు కొత్త ఎత్తులు వేస్తున్నారు. వివిధ రంగాల్లో వ్యాపారులు తమ వస్తువులను అమ్ముకోవడానికి ఉల్లిని ఎరగా వేస్తున్నారు. హైదరాబాద్‌లో ఓ సెల్‌ఫోన్ విక్రేత ఫోన్ కొంటే కిలో ఉల్లి ఉచితం అంటూ ప్రకటన చేశారు. అలాగే ఓ హైరా మార్కెట్ వారు 500 కొనుగోళ్లపై కిలో ఉల్లి 70 రూపాయలంటూ ప్రకటించారు. అలాగే వస్త్ర దుకాణాల వారు కూడా ఈ ఎత్తుగడలో భాగస్వామ్యం అవుతున్నారు. ఇకపోతే ఇప్పుడు ఉల్లిధరలపై సామాజిక మాధ్యమాల్లో బోలెడు జోకులు పేలుతున్నాయి. ఆటోవాల పెద్ద ఉల్లిగడ్డ తీసుకుని చిన్న ఉల్లిగడ్డ ఇవ్వడం, అత్త కోడలుకు బీరువా నుంచి చిన్న ఉల్లిపాయ తీసుకుని ఇవ్వడం లాంటివి చూస్తున్నాం.నెటిజన్లు కూడా నేడు సోషల్ మీడియాలో ఉల్లిగడ్డలు, వాటి ధరలపై రకరకాల పోస్టులు పెట్టి వైరల్ చేస్తున్నారు. ఏకంగా పెళ్లి వేడుకలో పెళ్లి కుమారుడు కుమార్తెకు ఉల్లిగడ్డలను ప్యాకింగ్ చేసి బహుమతిగా ఇవ్వడం, ఈజీ మంత్లీ ఇన్‌స్టాల్మెంట్ పద్ధతిలో ఉల్లిగడ్డలు లభిస్తాయనే ప్రకటన బోర్డులు పెట్టడం, ఆటోవాలాకు ఆటో చార్జీకి బదులుగా ఉల్లిగడ్డలను ఇవ్వడం, కోహినూర్ వజ్రం కంటే ఉల్లిగడ్డే విలువైనదని పోల్చడం వంటి పోస్టులు వైరల్ అయ్యాయి. వీటితోపాటు బహిరంగ మార్కెట్‌లో సైతం గృహిణిలు తమ ఇబ్బందులను తెలుపుతున్నారు. గత రెండు నెలలుగా ఉల్లి ధరలు పెరగడమే తప్ప తగ్గడం లేదు. ఏపి అసెంబ్లీలో సోమవారం ఉల్లి దండలతో టిడిపి ప్రదర్శన చేయడమే గాకుండా, అసెంబ్లీకి అలాగే హజరయ్యారు. మరో నెల దిటితే గాని ఉల్లి ధరలు దిగి రానంటున్నాయి. ఈ ఏడాది ఆగస్టులో భారీగా వర్షాలు కురవడంతో అప్పటికే సాగులో ఉన్న ఉల్లి పంట పూర్తిగా దెబ్బతిన్నది. దిగుబడి తగినంత లేకపోవడంతో మూడు నెలలుగా అంచెలంచలుగా ఉల్లి ధర పెరుగుతూ వచ్చింది. కొద్ది రోజుల నుంచి స్థానికంగా ఉల్లి సాగు తిరిగి ప్రారంభం కావడంతో ఆ పంట చేతికి వచ్చే వరకు ధరల ప్రభావం కొనసాగే అవకాశం ఉంది. అయితే ఇంట్లో కూరలు, అల్పాహారల్లో ఉల్లి గడ్డలు వినియోగించడం సర్వసాధారణం. అయితే ధరలు పెరగడంతో అన్ని వర్గాల వారికీ ఇబ్బంది ఎదురవుతోంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో ఉల్లి నాణ్యతను బట్టి 15 నుంచి 200 వరకు అమ్ముతున్నారు. యుద్ధప్రాతిపాదికన ఇతర రాష్ట్రాల నుంచి, దేశాల నుంచి భారీగా ఉల్లిని దిగుమతి చేస్తోంది. మొదటి రకం ఉల్లిగడ్డల ధర కేజీ రూ.150 రూ.170 మధ్య ఉంది. కొన్నేళ్లుగా ఉల్లిసాగు ఊసేలేకపోవడం, అవగాహన కల్పించినప్పటికీ రైతులు ఆసక్తి చూపకపోవడం ఇక్కడ దిగుబడి అంతగా లేదు. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి నిత్యం దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. దీంతో ధరలు అమాంతం పెరిగాయి. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్తితి. మరో రెండు నెలలపాటు ఇదే ఒరవడి కొనసాగే అవకాశం ఉంది. ఏటా ఏపీ, మహారాష్ట్ర, యూపీ, ఎంపీ తదితర రాష్ట్రాల నుంచి భారీగా ఉల్లిగడ్డలను జిల్లా వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. కర్ణాటక, రాజస్తాన్ రాష్ట్రాల నుంచి సైతం పరిస్థితులను బట్టి దిగుమతి చేసుకుం టుంటారు. తెలుగు రాష్ట్రాల్లో ఉల్లిసాగును ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గత ఐదేళ్లుగా రాష్ట్ర ఉద్యానవన, మార్కెటింగ్ శాఖ అనేక ప్రయత్నాలు చేసింది. రెండేళ్ల క్రితం ఆసక్తి కలిగిన ఉద్యాన రైతులకు అధికారులు హైదరాబాద్‌లో ఉల్లిసాగుపై అవగాహన సైతం కల్పించారు. అనంతరం ప్రభుత్వం ఉచితంగానే ఉల్లి విత్తనాలను రైతులకు పంపిణీ చేసింది. అయితే ఆ ఏడాది మాత్రమే కొందరు రైతులు సాగు చేపట్టారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఉల్లి సమస్యను అధిగమించేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వెంటనే ఇతర రాష్ట్రాల నుంచి ఉల్లిని దిగుమతి చేసుకునేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇదే అదునుగా ఉల్లిని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న వ్యాపారులపై నిఘా పెట్టింది. ఇతర రాష్ట్రాల నుంచి 500 మెట్రిక్ టన్నులను తీసుకొచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. బ్రెజిల్, టర్కీ, ఈజిప్టు దేశాల నుంచి భారత ప్రభుత్వం దిగుమతి చేస్తోంది. ఇవన్నీ మార్కెట్లోకి వస్తే తప్ప ఉల్లి ధరలు దిగేలా లేవు.

## లచ్చంపూర్‌లో నేడు కవి సమ్మేళనం

ఆదిలాబాద్,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): ప్రముఖ తత్వకవి యోగి పరమేశ్వరయ్య రచించిన ఆత్మ సాక్షాత్కారం, మానవద్గీత పుస్తకావిష్కరణ, కవి సమ్మేళనం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించ నున్నారు. తలమడుగు మండలం లచ్చంపూర్ గ్రామంలో దీనిని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు కవిసమ్మేళనం, మధ్యాహ్నం ఒంటి గంటకు పుస్తకావిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు. కవి సమ్మేళనంలో పాల్గొనే కవులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 93903 07565కు సెల్ నంబర్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా శ్రీశ్రీశ్రీ యోగానంద సరస్వతి స్వామిజీ, బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, టీడీసీసీ చైర్మన్ లోక భూమారెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. యోగి పరమేశ్వరయ్య భక్త బృందం, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలన్నారు.

# పౌరసత్వ బిల్లుపై రాజకీయాలా?

హైదరాబాద్, డిసెంబర్ 10:ఎట్టకేలకు పౌరసత్వ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఇక రాజ్యసభ వంతు మిగిలివుంది. అదికూడా అయిపోతే రాష్ట్రపతి సంతకంతో రాజముద్ర పడనుంది. నిజానికి ఎప్పుడో ఈ బిల్లును తీసుకుని రావాల్సి ఉంది. వివిధ దేశాల్లో ఉంటూ అక్కడి వేధింపులు తట్టుకోలేక వలసవచ్చిన మైనార్టీ హిందువులు, సిక్కులు, జైనులకు భారత పౌరసత్వం కల్పించే బిల్లు చారిత్రాత్మకమైనదిగా చెప్పుకోవాలి. ట్రిపుల్ తల్లాక్, 370 రద్దు వంటి బిల్లుల తరవాత ఇది కూడా అంతే ప్రయోజనకమైన చట్టంగా చూడాలి. ఇదో చారిత్రక అవసరం. దేశ విభజన సమయంలోనూ, అంతకు ముందు ఆయా దేశాల్లో పౌరులుగా ఉన్న వారిని మతం పేరుతో హింసలకు గురి చేశారు. లక్షల మందిని చంపేశారు. మతం మార్చేలా చేశారు. ఇవన్నీ తట్టుకుని ఇక అక్కడ ఉండలేమని భావించి వచ్చిన వారిని అక్కున చేర్చుకునే ప్రయత్నం చేయడమే ఈ పౌరసత్వ చట్టం ప్రధాన ఉద్దేశ్యం. దీనిని వ్యతిరేకించడం ద్వారా కాంగ్రెస్ సహా ఇతర పక్షాలు తమ కుహనా రాజకీయాలను బయట పెట్టుకున్నాయి. అర్ధరాత్రి వరకు ఏడు గంటల సుదీర్ఘచర్చ అనంతరం లోక్‌సభ సౌరసత్వం చట్టబిల్లుకు ఆమోదం తెలపడం నిజంగానే అభినందనీయం. భారత్‌కు శరణార్థులుగా వచ్చిన ముస్లిమేతరులను ఆదుకునేందుకే ఈ బిల్లు ఉద్దేశ్యమని బిజెపి ముందునుంచీ చెబుతోంది. వారినే ఎందుకు పౌరులుగా గుర్తించాలనుకుంటున్నదీ చెప్పింది. ఈ బిల్లుతో దేశంలోని ముస్లింలకు ఎలాంటి నష్టం ఉండదని కూడా హోంమంత్రి అమిత్‌షా ఈ సందర్భంగా స్పష్టం చేశారు. మైనార్టీలకు విఘాతమన్న కాంగ్రెస్ వాదనలో అర్థం లేదు. బిల్లును టీఆర్ఎస్ సహా పలు పార్టీలు వ్యతిరేకించిన విషయాన్ని ఇక్కడ గుర్తుంచాలి. వాటికి విశాల ప్రయోజనాల కన్నా ఓటు బ్యాంక్ రాజకీయాలే ముఖ్యమని గమనించాలి. అయితే ప్రతిపక్షాల తీవ్ర నిరసనల మధ్య కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. చర్చ సందర్భంగా ప్రతిపక్షాలు లేవనెత్తిన అభ్యంతరాలకు సమాధానం ఇచ్చారు. పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్‌లో మత పరమైన దాడులకు గురై భారత్‌కు శరణార్థులుగా వచ్చిన ముస్లిమేతరులను ఆదుకునేందుకే ఈ బిల్లును రూపొందించామని స్పష్టంచేశాక కూడా వ్యతిరేకించడం ద్వారా కుహనా రాజకీయాలకు ఆయా పార్టీలు తెరలేపాయి. మన దేశంలోని ముస్లింలకు ఈ బిల్లుతో ఎలాంటి సంబంధం లేదు. ఈశాన్య రాష్ట్రాల ప్రజలు ఆందోళన చెందవద్దని, ఇన్నర్ లైన్ పర్మిట్ (ఐఎల్‌పీ) కింద ఆయా రాష్ట్రాలకు ఈ బిల్లు నుంచి మినహా యింపు ఇస్తున్నట్టు అమిత్‌షా ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర్య సమయంలో దేశాన్ని మతం ప్రాతిపదికన విభజించింది. అయినా అక్కడే పుట్టి పెరిగివున్న హిందూ,సిక్కు మైనార్టీలకు పాక్‌లో రక్షణ లేకుండా పోయింది. నిజానికి దేశవిభజన జరగకపోయి ఉంటే ఉంటే ఈ బిల్లు తేవాల్సిన అవసరం ఉండేది కాదన్న హోంమంత్రి అమిత్‌షా ప్రకటనను ఇక్కడ అంతా గ్రహించాలి. పాక్,బంగ్లాల్లో ఎందరో అమాయక హిందువులు అక్కడి ముస్లింల దాడులకు బలయ్యారు. బతుకు జీవుడా అంటూ వేలాదిమంది మనదేశానికి పారిపోయి వచ్చారు. వారిని కాపాడుకోవడం మినహా మరో గత్యంతరం లేదు. అందుకే ఈ బిల్లు తేవాల్సి అవసరం ఏర్పడింది. ఇది దేశంలోని మైనార్టీలకు వ్యతిరేకంగా ఉన్నదని కాంగ్రెస్,దేశంలో ముస్లింలకు నీడ లేకుండా చేస్తారా? అని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యల్లో అర్థం లేదు. ఈ బిల్లుతో అమిత్ షా హిట్లర్ సరసన నిలుస్తారని తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ బిల్లు ప్రతులను చించివేయడం ద్వారా ఓవైసీ తన కుత్సిత రాజకీయాలను ప్రకటించుకున్నారు. ఇక్కడా రాజకీయాలు చొప్పించడం వారికే చెల్లింది. బిల్లుపై ఏడు గంటలకు పైగా జరిగిన చర్చ అనంతరం అర్ధరాత్రి 12 గంటలకు నిర్వహించిన ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 311 మంది, వ్యతిరేకంగా 80 మంది ఓటేశారు.దీంతో బిల్లు ఆమోదం పొందినట్టు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. కేవలం పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్‌లో దాడులకు గురై భారత్‌కు వలసవచ్చిన మైనార్టీ హిందువులకు స్వాంతన కలిగించి, వారి హక్కులను రక్షించేందుకే ఈ బిల్లును ప్రవేశపెట్టామని అమిత్‌షా పదేపదే పేర్కొన్నా విపక్షాలు మాత్రం నిజాలను గుర్తించలేక పోయారు. నేపాల్ పౌరులెవరైనా భారత పౌరసత్వాన్ని సులభంగా పొందవచ్చు. ఇక మయన్మార్ లౌకిక దేశం. కానీ.. పాక్, ఆఫ్టన్, బంగ్లాదేశ్ ముస్లిం దేశాలు. అక్కడ మైనార్టీలపై విపరీతంగా దాడులు జరుగుతున్నాయని అందరికీ తెలిసిందే. అదే విషయాన్ని బిల్లులో చర్చ సందర్భంగా అమిత్ షా పేర్కొన్నారు. దేశ విభజన సమయంలో పాక్‌లో 23 శాతంగా ఉన్న హిందూ మైనార్టీలు ఇప్పుడు 3 శాతానికి పరిమితమయ్యారు. అక్కడ హిందువులను ఊచకోత కోశారు. అంతెందుకు విభజన సమయంలో గుట్టలుగా రైలు బోగీల్లో శవాలు పంపిన చారిత్రక సత్యాన్ని విస్మరించగలమా అన్నది ఆలోచించాలి. అక్కడ ఉంటే ముస్లింలుగా ఉండాలి. లేకుంటే చావాలి. లేదా మతం మారాలన్న ఛాందసవాద ఆదేశాలతో అనేకులు మతం మారారు. బలవంతంగా మతం మార్చారు. బంగ్లాదేశ్‌లోనూ ఇలాంటి పరిస్థితే ఉంది. వీరందరికీ రక్షణ అవసరమని అమిత్ షా తెలిపారు. ఈ బిల్లు విభజనకారి కాదని, ఆర్టికల్ 14కు వ్యతిరేకం కాదని కూడా స్పష్టం చేశారు. ఇలా గతంలో అనేకమార్లు శరణార్థులకు పౌరసత్వం కల్పించామని గుర్తుచేశారు. 1971లో పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్ విడిపోయి నప్పుడు, ఉగాండాలో భారతీయులపై దాడులు జరిగినప్పుడు ప్రత్యేక నిబంధనల ద్వారా బాధితులకు పౌరసత్వం ఇచ్చామని ఆయన గుర్తుచేశారు. ఈ మూడు దేశాల్లో ముస్లింలు మతపరమైన దాడులకు గురయ్యే ప్రమాదం లేదు. అందువల్ల రోహింగ్యాలను గుర్తించలేమని కూడా షా తెలిపారు. మొత్తంగా ఈ బిల్లు వల్ల భారత్‌తో విడిపోయి ముస్లిం దేశాలుగా ఉన్న పాక్,బంగ్లాల నుంచి వచ్చే హిందువులకు రక్షణగా నిలవనుంది. బిజెపి చేపట్టిన సాహసోపేత నిర్ణయాల్లో ఇది కూడా ఒకటని గుర్తించాలి. ఇదో చారిత్రక అవసరమే కాకుండా చరిత్రలో నిలిచిపోయే చట్టంగా చూడాలి.

# బిజెపికి బలాన్ని ఇచ్చిన కర్నాటక ఫలితాలు

### ఇతర రాష్ట్రల్లో ప్రభావం చూపడం ఖాయం

### మరింత కుంగిపోనున్నకాంగ్రెస్

న్యూఢిల్లీ,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): మహారాష్ట్ర పరిణామాల తరవాత, జార్ఖండ్ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో కర్ణాటక ఉప ఎన్నికల ఫలితాలు బిజెపికి పెద్ద బూస్ట్ ఇచ్చాయనే చెప్పాలి. అలాగే కర్నాకటలో సుస్థర బిజెపి ప్రభుత్వం ఏర్పడడానికి ఈ ఫలితాలు దోహదవడ్డాయి. మరో మూడున్నరేళ్లు ఇక ఎలాంటి అనుమానాలు లేకుండా ముఖ్యమంత్రి యెడియూరప్ప సిఎంగా కొనసాగనున్నారు. ఆయన కాకున్నా వేరెవరు సిఎంగా ఉన్నా ఇక కర్నాటకలో బిజెపి ఢోకాలేదు. ప్రధానంగా మహారాష్ట్రలో శివసేన జారుకున్నాక వచ్చిన ఫలితాలు కావడంతో బిజెపికి ఇమేజ్ పెరిగిందనే భావించాలి. విపక్షాల విమర్శలు, బలం లేదన్న ఆరోపణలతో ఇక అర్థంతరంగా కుర్చీ దిగాల్సిన అవసరం లేకపోగా, మూడున్నరేళ్ళూ బిజెపి అధికారంలో కొనసాగేందుకు ఉప ఎన్నికల ఫలితాలు దోహదపడ్డాయి. ఉప ఎన్నికలు జరిగిన 15అసెంబ్లీ స్థానాల్లో పన్నెండింటిని బీజేపీయే గెలుచుకోవడం, కాంగ్రెస్ రెండు స్థానాలైనా గెలుచుకుంటే, కుమారస్వామి పార్టీకి ఒక్కటీ దక్కకపోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. తమపై రాహుల్‌గాంధీ ఎంతో నమ్మకం పెట్టుకున్నారనీ, తామూ శ్రమించినా ఫలితం దక్కలేదంటూ పీసీసీ అధ్యక్షపదవికి గుండూరావు, విపక్ష నేత స్థానానికి సిద్దరామయ్య రాజీనామాలు చేశారు. కాంగ్రెస్-జెడిఎస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని కూలదోసి, బీజేపీని అధికారంలో కూచోబెట్టడానికి ఎంతగానో సహకరించిన ఈ ఎమ్మెల్యేలంతా మళ్లీ గెలిచారు. దీంతో వీరికి సహజంగానే మంచి మంత్రి పదవులు దక్కనున్నాయి. అసెంబ్లీలో బీజేపీకి ఇప్పుడు అవసరానికి మించి మరో ఐదుగురి బలం చేకూరింది. హైకోర్టు కేసు కారణంగా రెండుస్థానాలకు ఎన్నికలు జరగక పోవడంతో సభ మొత్తం బలం, మెజారిటీ హద్దు తక్కువగా ఉన్న విషయం తెలిసిందే. దీనికితోడు ఒక ఇండిపెండెంట్ ఎమ్మెల్యే కూడా బీజేపీ పక్షానే ఉన్నారు. అధికారాన్ని హస్తగతం చేసుకున్న యెడ్యూరప్ప ఇప్పటివరకూ అత్తెసరు మెజారిటీతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో 104స్థానాలు సంపాదించిన యెడియూరప్ప సంఖ్యాబలం లేకున్నా, ఎదుటివారికి వల విసరగలనన్న నమ్మకంతో ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధపడి, చివరకు సాధ్యం కాక బలపరీక్షకు ముందు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్-జెడీఎస్ కూటమి తన 13నెలల పాలననూ కూల్చడంలో ఈ ఎమ్మెల్యేలు ప్రధాన పాత్ర పోషించారు. వీరంతా బీజేపీకి సహకరించినప్పటికీ, స్పీకర్ అనర్హత వేటుతో పరిణామాలు మారిపోయాయి. సుప్రీంకోర్టు ఈ ఎమ్మెల్యేల అనర్హతను ఎత్తిపడుతూనే, ఎన్నికల్లో పోటీకి వీలుకల్పించింది. ఉపఎన్నికల ప్రచారంలో కేంద్రపెద్దలెవ్వరూ పాల్గొనకపోవడం, యెడియూరప్పే సమస్తమూ చక్కబెట్టడం గమనించాలి. ఈ ఎన్నికల్లో బీజేపీ కులసమీకరణాలను సైతం అధిగమించి రాష్ట్రంలోని కొత్త ప్రాంతాలకు విస్తరించింది. ప్రాంతీయాధినేతలను చక్రం తిప్పనివ్వని బీజేపీ అధిష్ఠానం ఇకపై యెడ్డీ విషయంలో కాస్తంత భిన్నంగా వ్యవహరించక తప్పదు. ఎన్నికలు జరిగిన ప్రతిసారీ రాజకీయ సంక్షోభంలో కూరుకుపోతున్న కాంగ్రెస్‌కు సోమవారం వెలువడిన కర్ణాటక ఉప ఎన్నికల ఫలితాల్లోనూ అదే పునరావృతం అయింది. అభ్యర్థుల ఎంపికనూ, ప్రచార బాధ్యతల్ని తన భుజస్కంధాలపై వేసుకున్న ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఉప ఎన్నికలు రాజకీయంగా ఆయన స్థానాన్ని సుస్థిరం చేశాయి. బీజేపీకి ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకమైనవి. మహారాష్ట్రలో ఊహించనివిధంగా కూటమి భాగస్వామి శివసేన విప క్షాలతో చేతులు కలిపి తమకు అధికారం దక్కకుండా చేసింది. పైగా అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న జార్ఖండ్‌లో ఇంకా మూడు దశలు పూర్తి కావలసి ఉంది. పైగా జేడీఎస్‌కు కంచుకోట అయిన ఓల్డ్ మైసూరు ప్రాంతంలోని మాండ్యా జిల్లాలో తొలిసారి బీజేపీ విజ యకేతనం ఎగరేసింది. అక్కడ కృష్ణరాజపేటె స్థానం తన ఖాతాలో వేసుకుంది. జేడీఎస్‌కు దన్నుగా ఉండే వొక్కళిగ జనాభా అధికంగా ఉన్న స్థానమిది. జనమంతా ఫిరాయింపు దార్లకు గట్టిగా బుద్ధి చెబుతారని భావించాయి. కేవలం బీజేపీని అధికారానికి దూరంగా ఉంచడం కోసం కలవడం తప్ప రాజకీయంగా ఆ రెండు పార్టీలూ ఒక ఉమ్మడి ఎజెండా రూపొందించుకోలేక పోయాయి. వరస వివాదాల్లో ఆ పార్టీలు తలమునకలై ఉండగా ఉపాధి లేమి, కరువుకాటకాలు రాష్ట్రాన్ని పీల్చిపిప్పి చేశాయి. వీటన్నిటినీ ప్రజలు మరిచిపోలేదు. కనుకనే ఫిరాయింపుదార్ల అనైతిక రాజకీయాల గురించి ఎంత ప్రచారం చేసినా వారు పట్టించుకోలేదు. బీజేపీ ప్రచారం చేసిన సుస్థిర పాలన, అభివృద్ధికే వారు ఓటేశారు. ఈ ఫలితాలతో దేశంలో కూడా పార్టీ ప్రతిష్టను యడియూరప్ప పెంచగలిగారు. ఈ ఉప ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌ను మరింత కుంగదీసే ప్రమాదం ఉంది. ఆ పార్టీ జాతీయ నాయకత్వం నిస్తేజంగా ఉండటం, రాష్ట్రంలో పార్టీ సారథులు రాజీనామాలు చేయడం నైతికంగా ఆ పార్టీ ఎమ్మెల్యేలను కుంగదీస్తుంది. ఇప్పుడు సుస్థిర మెజారిటీ లభించింది గనుక బీజేపీ ప్రభుత్వం ఇక పాలనపై దృష్టి పెట్టనుంది. .

# ప్రజల భాగస్వామ్యంతోనే పారిశుద్ధ్యం సాధ్యం

### సీజనల్ వ్యాధుల నివారణకు ఇదే మార్గం

### మంత్రి కెటిఆర్ తరచూ చేస్తున్న సూచనలు ఇవే

హైదరాబాద్,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో ప్రజలు డెంగీ, తదితర వైరల్ జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఏటా వానాకాలంలో ఇటువంటి వ్యాధులు ప్రబలడం సర్వసాధారణంగా మారింది. చలికాలం వచ్చే సరికి స్వైన్ ఫ్లూ లాంటి వ్యాధులు విజృంభిస్తున్నారు. పట్టణాలఉ ,పల్లెలు అనే తేడా లుకుండా స్వచ్ఛంగా ఉంచాలని పదేపదే ప్రచారం చేస్తున్నా ప్రజలు పట్టించుకోవడం లేదు. ఎవరికి వారు తమకేంటన్న భావనతో అపరిశుభ్రతకు కారణమవుతున్నారు. ఇకపోతే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నామని నాయకులు చెపుతున్నా వాస్తవం వేరే రకంగా కనిపిస్తోంది. పారిశుద్ధ్యలేమి కారణంగానే ఇటువంటి వ్యాధులు ప్రబలుతున్న విషయం సుస్పష్టం. ఈ క్రమంలో ప్రజలు పురపాలకసంస్థపై ధ్వజమెత్తుతున్నారు. అపరిశుభ్రత కారణంగా దోమలు విజృంబించడంతో డెంగీ వ్యాధికి చికిత్స పొందుతూ మరణించడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నది. సీజనల్ వ్యాధుల నివారణ ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవు తుందని పురపాలక శాఖ మంత్రి కేటీ రామారావు అభిప్రాయపడ్డారు. బహిరంగ ప్రదేశాలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపా లిటీలు, జీహెచ్ఎంసీ తరుపున దోమల నివారణతో పాటుగా పారిశుద్ధ్య నిర్వహణ చేసేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నామని కేటీఆర్ తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో పారిశుద్ధ్య నిర్వహణ పైన దృష్టి సారించి, ప్రభుత్వ ప్రయత్నాలతో కలిసి రావాలని పిలుపిచ్చారు. ముఖ్యంగా దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు సొంత ఇళ్లలోని పారిశుద్ధ్యం అత్యంత కీలకమైన అంశం అన్నారు. ఇళ్ళలో పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని కేటీఆర్ తెలిపారు. ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్యవంతం చేసి, పారిశుద్ధ్య నిర్వహణలో వారిని భాగస్వావములను చేసేందుకు ప్రభుత్వ అధికారులు, పురపాలక ప్రతినిధులు కృషి చేస్తూనే ఉన్నారు. ఇళ్ళలో పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని పదేపదే కోరుతున్నారు. ముఖ్యంగా దోమల వృద్ధికి అవకాశం ఉన్న ఉన్న నీటి తొట్లు, నీటి నిలువ ప్రదేశాల్లో నీటిని తొలగించే చర్యలు తీసుకోవాలన్నారు. దీంతోపాటు ఇంటి మూలల్లో ఉన్న ఉపయోగంలో లేని వస్తువులను తీసివేసి, దోమల లార్వా వృద్ధికి అవకాశం లేకుండా చేసే చర్యలను చేపట్టాలన్నారు.

## మేడారం జాతర ఆదాయంపై ఆర్టీసీ దృష్టి

### ప్రయాణికులకు అనుగుణంగా బస్సులు

### వివిధ జిల్లాల నుంచి ప్రత్యేక బస్సుల ఏర్పాటు

వరంగల్,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): మేడారం మహాజాతరకు వచ్చే భక్తుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు వేల బస్సులు నడుపనున్నట్లు ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ సీ వినోద్ తెలిపారు. ఇటీవలి సమ్మెతో నష్టపోయినందున జాతరలో అత్యధిక ఆదాయంపై అధికారులు దృష్టి పెట్టారు. వివిధ ప్రాంతాల నుంచి బస్సులు నడపడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలని చూస్తున్నారు. వచ్చే ఫిబ్రవరిలో జరుగనున్న మహాజాతరకు ఆర్టీసీ బస్సుల నిర్వహణపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల రీజినల్ మేనేజర్లు, డివిజనల్ మేనేజర్లు, వరంగల్ రీజియన్ సబంధించిన డిపో మేనేజర్లు, కంట్రోలర్లు హాజరయ్యారు. జాతర ఏర్పాట్లపై ఆర్టీసీ సంస్థ నుంచి తీసుకోనున్న చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు.మేడారం జాతర ఆర్టీసీ ప్రాంగణంలో కూడా జిల్లాల వారీగా బస్ పాయింట్లను సిద్దంచేసుకోవాలని సూచించారు. బస్సులు, రూట్ల వారీగా సిబ్బందిని సమకూర్చుకోవాలని, ఇందుకనుగుణంగా వారికి వసతులు కల్పించాలని వినోద్ కోరారు. జాతర బస్సులను కండిషన్ ఉంచుకోవడానికి జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు..భక్తులను క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేయడానికి ఆర్టీసీ అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని అన్నారు. గత జాతరలో 3600 బస్సులు నడిపామని ఈ సందర్భంగా వినోద్ వివరించారు. ఈ సారి భక్తులు మరింత పెరిగే అవకాశమున్నందున బస్సుల రాకపోకలు, అనుభవాలు , ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని మరింత పక్కందీగా ఏర్పాట్లు చేయాలని ఆయన ఆయా జిల్లాల అధికారులను ఆదేశించారు. ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ,వరంగల్ ఉమ్మడి జిల్లాల వారీగా జాతర బస్ ,బస్సుల సంఖ్య, భక్తులకోసం కల్పించాల్సిన వసతులపై మాట్లాడారు. పాత ఐదు జిల్లాల నుంచి గతంలో ఉన్న బస్ నుంచి ఈసారికూడా బస్సుల ఆపరేషన్స్ చేయాలని కోరారు. భక్తుల రద్దీనిబట్టి అవసరమైన మేరకు మరిన్ని బస్సులను నడుపాలని, ప్రతి బస్ పాయింట్ వద్ద జాతర కోసం కావాల్సిన ఏర్పాట్లను ఇప్పటి నుంచే సిద్ధం చేసుకోవాలని ఆయన కోరారు. త్వరలోనే ఆర్టీసీ ఎండీ మేడారం జాతర ప్రాంతాన్ని సందర్శిస్తారని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ సీ వినోద్ తెలిపారు. వెంటనే పనులు ప్రారంభించి, వీలైనంత తొందరగా పూర్తి చేయాలని అన్నారు. ఇదిలా ఉండగా మేడారం జాతరకు ఆర్టీసీ ఏర్పాట్ల పర్యవేక్షణలో భాగంగా వినోద్ రెండు రోజులు ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించారు.

## ఉపాధి పథకం పనుల నిర్ధారణ

### వందరోజుల పని లక్ష్యంగా కార్యాచరణ

సూర్యాపేట,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): ఉపాధి హామిపథకంలో గ్రామాల్లో అవసరమైన పనులు చేసేలా కార్యాచరణ రూపొందించారు. అలాగే పంచాయితీ భవనాల నిర్మాణం చేపడతామని ఇప్పటికే మంత్రిఎర్రబెల్లి దయాకర్ రావు ప్రకటించారు. ఈ పథకం ద్వారా హరితహారంలో మొక్కలు నాటడం వాటిని సంరక్షణతో పాటు చెరువుల్లో పూడిక తీయడం, కాల్వల్లో పేరుకు పోయిన పూడిక, చెత్తను తొలగించడం, వ్యవసాయ భూముల వద్దకు బాటలు నిర్మించడం, ఇంకుడు గుంతలు, కందకాలు తీయడం, బావుల తవ్వకం, రోడ్ల నిర్మాణాలు, శ్మశాన వాటికలు, కిచన్ షెడ్స్‌ల నిర్మాణం తదితర పనులు చేయడం జరుగుతుంది. మెటీరియల్ కంపోనెంట్ కింద భవనాలు, కంపాడ్ వాల్స్, సీసీరోడ్లు నిర్మాణం వంటివి చేయాల్సి ఉంటుంది. ఈ పనులను ఆయా గ్రామాల్లో గుర్తించి కూలీలతో చేయిస్తారు. జాతీయ ఉపాధి హామీ పథకం ప్రతి ఒక కూలికి వందరోజుల పని కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని చట్టం చేయడం జరిగింది. గ్రామాలల్లో ఉండే కూలీలకు ఉపాధి కల్పించడం.. కరువు సంభవించనప్పుడు గ్రామాలను వదిలి వలసలు వెళ్లకుండా పనులు కల్పించే ఉద్దేశంతో ఈపథకం రూపకల్పన చేయడం జరిగింది. ఉపాధి హామిలో జాబ్‌కార్డులు పొందిన కుటుంబానికి సంవత్సరంలో 100 రోజులు తప్పని సరిగా పని కల్పించాల్సి ఉంది. పనిని బట్టి ఈ పథకంలో అత్యధికంగా ఒక వ్యక్తికి రోజుకు రూ.17 కూలీ అందించాల్సి ఉంటుంది.ప్రస్తుతం సూర్యాపేట జిల్లాలోని 23 మండలాల పరిధిలోని 475 గ్రామ పంచాయతీలలో 2,45,405 కుటుంబాలకు గాను 5,69,37 మందికి ఉపాధి హామిలో జాబ్‌కార్డులు కలిగి ఉన్నారు. జిల్లా ఏర్పడిన నాటి నుంచి ఉపాధి హామిలో సూర్యాపేట జిల్లా రాష్ట్రవ్యాప్తంగా మంచిస్థానంలో నిలుస్తూ వస్తుంది. ఎంతమంది కూలీలు అవసరం అనే అంశాలతో గ్రామాల వారీగా ఉపాధి ప్రణాళికలను తయారు చేయడం జరిగింది. గ్రామసభల అనంతరం మొత్తం సమాచారాన్ని మండలాల వారీగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖకు పంపించారు. 2020-21 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లావ్యాప్తంగా 55,79,41 పనిదినాలు కల్పించాలని నిర్ణయించారు. గత ప్రణాళికతో పోల్చితే సుమారు 6.5 లక్షల పనిదినాలు తగ్గడం జరిగింది. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ తయారు చేసిన ప్రణాళికను కలెక్టర్ ఆమోదించాల్సి ఉంది. ఆ సమయంలో కలెక్టర్ ఉపాధి పనిదినాలు పెంచే అవకాశం లేదా యాథాతథంగా ఆమోదించే అధికారం సైతం ఉన్నది. ఉపాధి హామిలో గుర్తించిన పనిలో 60శాతానికి తగ్గకుండా లేబర్ కంపోనెంట్, 40శాతం మించకుండా మెటీరియల్ కంపోనెంట్ ఉండే విధంగా ప్రణాళికలు తయారు చేయడం జరుగుతుంది. సుమారు రూ.4.37 కోట్లు ఉపాధి హామిలో ఖర్చు చేయడం జరిగింది. ఈఏడాది సగటున ఒక కూలీకి 110.29 పైసలు పడగా 2241 కుటుంబాలకు వందరోజుల పాటు పనికల్పించారు.

## సాగు, తాగు నీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత

### డిండి ద్వారా రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు

### మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

నల్లగొండ,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రభుత్వం సాగు, తాగు నీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తుందని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌డ్డి అన్నారు. రైతులకు ఉచితంగా 24 గంటల కరెంట్‌ను అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని చెప్పారు. కరువుతో నిండని డిండి ప్రాజెక్టును కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా నింపి రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరును అందించనున్నట్టు తెలిపారు. పేదలల అభ్యున్నతి కోసమే సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో యుద్ధ ప్రాతిపదికన కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు

దులపై నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టులను ప్రభుత్వం త్వరలో పూర్తి చేసి తెలంగాణ రైతుల సాగునీటి కష్టాలు తీరుస్తుందన్నారు. ప్రతినియోజకవర్గంలోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన మిషన్‌భగీరథ జలాలను అందజేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ఇందుకు అనుగుణంగా సిఎం కెసిఆర్ ఆదేశాలను జారీ చేశారని అన్నారు. మిషన్ భగీరథ నీటి వాడకంపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇప్పటికే మిషన్ భగీరథ పథకం ద్వారా శుద్ధి చేసి సరఫరా చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అంకుటిత దీక్షలో ప్రతి గ్రామంలో 24 గంటల విద్యుత్ సరఫరా అవుతుందని, ఇందుకు అనుగుణంగా స్థానిక విద్యుత్ అధికారులు సరఫరాలో జాప్యంలేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సర్పంచులు, అధికారులు స్పందించి పరిష్కార దిశగా అడుగులు వేయాలని సూచించారు.

# రెచ్చిపోతున్న కామాంధులు

## యువతిపై అత్యచార ఘటన

భువనేశ్వర్,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): ఒడిశాలో కామాంధులు రెచ్చిపోయారు. రాష్ట్రంలో ఒకే రోజు వేర్వేరు చోట్ల ఐదు అత్యాచార యత్నాలు జరిగాయి. మయూరభంజ్ జిల్లా బాదంపహాడ్ ప్రాంతంలో 16 ఏళ్ల బాలికపై నారాయణ మండల్ అనే 25 ఏళ్ళ యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో విషయం తెలుసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. ఇంకా గంజాం జిల్లా కళ్లికోట్‌లో జరిగిన మరో ఘటనలో నాలుగేళ్ల బాలికపై 16 ఏళ్ల బాలుడు అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఇది మరి దారుణమైన ఘటన అనే చెప్పాలి. 16 ఏళ్ళ పిల్లోడు అత్యాచారం అంటే అసలు ఎం అవుతుంది ఈ లోకం.. దారుణమైన లోకం. అదే ఒడిశాలో మరో చోట బాలేశ్వర్ జిల్లాలో జరిగిన ఇంకో ఘటనలో బాలికపై యువకుడు అత్యాచారం యత్నం చేశాడు. రాజధాని అయిన భువనేశ్వర్‌లో 45 ఏళ్ల వ్యక్తి ఏడేళ్ల బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. కటక్‌లోని కాన్‌నగర్ ప్రాంతంలోని కాళికాదేవి ఆలయం వద్ద ఆడుకుంటున్న ఐదేళ్ల చిన్నారిపై ఓ యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనలు అన్ని 24 గంటల్లోనే చోటుచేసుకున్నాయి. దీంతో రాష్ట్రం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. ఎన్కౌంటర్ చేసిన మమ్మల్ని కాదు కదా.. మేమెందుకు మారాలి అన్నట్టు ప్రవర్తిస్తున్నారు నీచులు.

# రాష్ట్రపతి భవన్‌కు జెఎన్‌యూ విద్యార్థుల కవాతు

## –లాఠీఛార్జ్‌తో అడ్డుకున్న పోలీసులు

న్యూఢిల్లీ,డిసెంబర్10(ఆర్ఎన్ఎ) పెంచిన హాస్టల్ ఫీజులను తగ్గించాలంటూ రాష్ట్రపతి భవన్‌కు కవాతు చేపట్టిన విద్యార్థులపై పోలీసులు లాఠీ చార్జ్ చేశారు. రాష్ట్రపతి భవన్‌కు వస్తున్న విద్యార్థులను అడ్డుకున్న పోలీసులు వెనక్కి వెళ్లాలంటూ హెచ్చరికలు జారీ చేశారు. అయినప్పటికీ విద్యార్థులు బెదరకుండా ముందుకు సాగుతుండడంతో లాఠీ చార్జ్ చేశారు. హాస్టల్ ఫీజులను తగ్గించాలంటూ కొద్ది రోజులుగా ఆందోళన చేస్తోన్న జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం విద్యార్థులు.. సోమవారం రాష్ట్రపతి భవన్‌కు కవాతు ప్రారంభించారు. తమ సమస్యలు పరిష్కారించాలంటూ కొద్ది రోజుల క్రితం పార్లమెంట్ ముట్టడికి యత్నించిన విషయం తెలిసిందే. అయితే విద్యార్థులు పార్లమెంటుకు వెళ్లకుండా ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం తమ సమస్యలు విన్నవించేందుకు రాష్ట్రపతి భవన్ బాట పట్టారు. ఇదే విషయమై నిరసనలు చేస్తున్న విద్యార్థులపై లాఠీ ఛార్జ్ కూడా జరిగింది. అనంతరం రాష్ట్రపతి భవన్‌కు కవాతు ప్రారంభించిన విద్యార్థులపై మరోసారి లాఠీ చార్జ్ జరిగింది. విద్యా బోధన, పరిశోధనలకు ప్రఖ్యాతి గాంచిన ప్రభుత్వ ఉన్నత విద్యా సంస్థ జేఎన్‌యూలో.. ప్రైవేటు విద్యా సంస్థలతో పోలిస్తే ఫీజులు చాలా తక్కువగా ఉంటాయి. ఇక్కడ చదువుకోవటానికి ముఖ్యంగా ఆర్థికంగా బలహీన వర్గాల విద్యార్థులు అధిక ప్రాధాన్యమిస్తారు. హాస్టల్ ఫీజును ఇంత భారీగా పెంచటం వల్ల పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత చదువులు చదవలేరని ఈ విద్యార్థులు వాదిస్తున్నారు.

# బెంగాల్లో పౌరసత్వ బిల్లుకు స్థానం లేదు

## –అనుమితించేది లేదన్న మమతా బెనర్జీ

కోల్‌కత,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): పౌరసత్వ సవరణ బిల్లు, జాతియ పౌర జాబితాలను వ్యతిరేకించాలంటూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ.. ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ రెండూ ఒకే నాణెళినికి చెందిని రెండు వైపులని వ్యాఖ్యానించారు. ఒక్క భారత పౌరుడిని కూడా శరణార్థిగా మారనీయబోమని ఆమె తేల్చిచెప్పారు. టీఎమ్‌సీ అధికారంలో ఉన్నంత వరకూ బెంగాల్‌లో పౌరసత్వం సవరణ బిల్లుకు, ఎన్నార్సీకీ స్థానం ఉండదని ప్రజలకు భరోసా ఇచ్చారు. వీటి గురించి మీరు భయపడాల్సిన అవసరం లేదు. మేం అధికారంలో ఉన్నంత వరకూ వీటికి బెంగాల్లో స్థానం లేదు. ఎన్నార్సీ పేరుతో ఈ దేశ పౌరులను వారు ఎప్పటికీ వెళ్లగొట్టలేరు, వారిని శరణార్థులుగా మార్చలేరు' అని మమతా మెనర్జీ స్పష్టం చేశారు.

భారత సమాజాన్ని చీల్చే చర్య: అఖిలేశ్

పౌరసత్వ సవరణ బిల్లుతో భారత సమాజాన్ని చీల్చేందుకు భారతీయ జనతా పార్టీ కుట్ర పన్నుతోందని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ నిప్పులు చెరిగారు. ఈ బిల్లు దేశానికి అవమానకరమని ఆయన అన్నారు. ఈరోజు పార్లమెంట్‌లోని లోక్‌సభలో పౌరసత్వ సవరణ బిల్లును కేంద్ర మంత్రి అమిత్ షా ప్రవేశపెట్టారు. రైతుల ఆదాయం రెట్టింపు చేయలేదు. గంగా నదిని శుభ్రపరచలేదు. ఆర్థిక పరిస్థితిని ఏమాత్రం ముందుకు తీసుకెళ్లలేదు. నల్లధనం ఇంకా తిరిగిరాలేదు. భారత పుత్రికలు అత్యంత ప్రమాదంలో ఉన్నారు. వారిని కాపాడే ప్రయత్నం చేయలేదు. నేను ముందుగా చెప్పినట్టే సమాజం దృష్టి మరల్చే కుట్ర రాజకీయాలు బీజేపీ చేస్తోందని అన్నారు. ఇక పౌరసత్వ సవరణ బిల్లుపై మాట్లాడుతూ ఈ బిల్లు భారత సమాజాన్ని చీల్చేందుకే ఉపయోగపడుతుంది. భారత సమాజాన్ని ఇది అవమానిస్తోంది. సమాజ్‌వాదీ పార్టీ ఈ బిల్లును వ్యతిరేకిస్తోందని అన్నారు.

# పిన్నవయసు ప్రధానిగా మారిన్ రికార్డ్

న్యూఢిల్లీ,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): ఫిన్‌ల్యాండ్ ప్రధానిగా సన్నా మారిన్ రికార్డు క్రియేట్ చేయనున్నారు. 34 ఏళ్లకే ఆమె ప్రధాని బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రధాని బాధ్యతలు చేపట్టిన అతిపిన్న వయసున్న మహిళగా మారిన్ ఘనత సాధించనున్నారు. మహిళల నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి ఆమె సారథ్యం వహించనున్నారు. మాజీ ప్రధాని అంటి రిన్నే .. దేశంలో పోస్టల్ సమ్మెను సరిగా నియంత్రించలేకపోయారు. దీంతో ఆమె తన పదవి నుంచి తప్పుకుంటూ రాజీనామా చేశారు. మారిన్ త్వరలో ప్రధాని బాధ్యతలు స్వీకరించనున్నారు. న్యూజిలాండ్ ప్రధాని జెసిండా ఆర్‌డెర్న్ వయసు 39 ఏళ్లు కాగా, ఉక్రెయిన్ ప్రధాని ఒలెక్సీ హోంచార్కు వయసు 35 ఏళ్లు.

# తెలంగాణలో పర్యావరణ పరిరక్షణ భేష్

## –అమెరికన్ బృందం కితాబు

హైదరాబాద్,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): తెలంగాణలో పర్యావరణ పరిరక్షణ విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు బాగున్నాయని అమెరికా ప్రభుత్వం తరపున దక్షిణ ఆసియా ప్రాంతీయ శాస్త్రసాంకేతిక, పర్యావరణ, వైద్యాధికారి సారాలిట్కే ప్రశంసించారు. హైదరాబాద్‌లో పర్యటిస్తున్న సారాలిట్కే బృందం సోమవారం అరణ్యభవన్‌లో పీసీసీఎఫ్ ఆర్.శోభ తో భేటీ అయ్యారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పర్యావరణ పరిరక్షణ, తెలంగాణకు హరితహారం, కంపా నిధులతో చేపట్టిన అటవీ పునరుజ్జీవన చర్యలు, అర్బన్ ఫారెస్ట్రీ పార్కులు, ప్రత్యామ్నాయ అటవీ పెంపకం పనులను వివరించారు. ఈ సమావేశంలో సీనియర్ అటవీ అధికారులు లోకేష్ జైస్వాల్, స్వర్గం శ్రీనివాస్, ఆర్ఎం డో బ్రియల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆడిట్ పూర్తయ్యాక పోలవరానికి నిధులు

## – కేంద్రం మంత్రి షెకావత్

న్యూఢిల్లీ, డిసెంబర్10(ఆర్ఎన్ఎ) : పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించడానికి ముందు చేసిన రూ.5వేల కోట్ల ఖర్చుపై కేంద్ర ఆర్థిక శాఖ ఆడిట్ జరుపుతోందని, ఆడిట్ పూర్తయ్యాక దాని ప్రకారం నిధులు విడుదల చేయడం జరుగుతుందని కేంద్ర మంత్రి గజేంద్ర షెకావత్ పార్లమెంట్‌లో ప్రకటించారు. పోలవరం ప్రాజెక్టు పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.3,222.75 కోట్లు విడుదల చేయవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తితో పాటు ఈ ప్రాజెక్టుకు సంబంధించి సవరించిన నిర్మాణ వ్యయం అంచనాలను ఆమోదించే అంశాలను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోందా? అంటూ రాజ్యసభలో కేంద్ర మంత్రి గజేంద్ర షెకావత్‌ను ఎంపీ విజయసాయి ప్రశ్నించారు. దీనికి స్పందించిన మంత్రి షెకావత్.. రూ. 5వేల కోట్ల ఖర్చుకు సంబంధించి కేంద్ర ఆర్థిక శాఖ ఆడిట్ జరుపుతోందని తెలిపారు. ఇప్పటి వరకు రూ.3వేల కోట్ల మేరకు ఆడిట్ పూర్తయినందున అందులో కొంత మొత్తం విడుదల చేసే అంశాన్ని ఆర్థిక శాఖ పరిశీలిస్తోందని చెప్పారు.

# మద్యం కారణంగానే అత్యాచార కేసులు: భట్టి

ఆదిలాబాద్,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతుందని, విచ్చలవిడిగా మద్యం విక్రయాల వల్లే అత్యాచారాలు జరుగుతున్నాయని తెలంగాణ సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని లింగాపూర్ అటవీ ప్రాంతంలో సీఎల్పీ నేతల బృందం పర్యటించింది. లింగాపూర్ అటవీ ప్రాంతంలో అత్యాచారం, హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.పోలీసులను ప్రభుత్వమే వారి విధులు సక్రమంగా నిర్వహించనీయడం లేదని ఆరోపించారు. అక్రమ మద్యం విక్రయాలకు ప్రభుత్వమే ద్వారాలు తెరిచిందన్నారు. అత్యాచారాలు నియంత్రించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని మండిపడ్డారు. ------------------

## పౌరసత్వ బిల్లు..

# మైనార్టీలకు వ్యతిరేఖం కాదు

- దేశంలోకి అక్రమ వలసల్ని నిరోధించేందుకే బిల్లు తీసుకొచ్చాం
- బిల్లుపై జరిగే చర్చలో ప్రతిపక్షాలు పాలుపంచుకోవాలి
- ప్రతీ ప్రశ్నకు సమాధానమిస్తాం
- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా
- బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టడానికి ఓటింగ్
- అనుకూలంగా 293ఓట్లు, వ్యతిరేకంగా 82 ఓట్లు
- ప్రభుత్వం తీరుపై మండిపడ్డ విపక్ష పార్టీల సభ్యులు

న్యూఢిల్లీ, డిసెంబర్10(ఆర్ఎన్ఎ) : లోక్‌సభలో ప్రవేశపెట్టిన పౌరసత్వ చట్ట సవరణ బిల్లుపై లోక్‌సభలో వాడివేడి చర్చ జరిగింది. ఈనందర్భంగా బిల్లు ప్రవేశపెట్టిన కేంద్ర హోంమంత్రి మాట్లాడుతూ.. ఇది మైనారిటీలకు 0.001శాతం కూడా వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని ఏ అధికరణను బిల్లు ఉల్లంఘించడం లేదని తెలిపారు. దేశంలోకి అక్రమ వలసల్ని నిరోధించేందుకే బిల్లు తీసుకొచ్చామన్నారు. దేశ విభజన సమయంలో పౌరసత్వానికి కటాఫ్ పెట్టలేదా ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు, విదేశాల్లో గ్రీన్‌కార్డులు దేనికి సంబంధించినవని అన్నారు. ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్ నుంచి అక్రమ వలసలు కొనసాగుతన్నాయని తెలిపారు. పొరుగు దేశాలతో పోలిస్తే భారత్‌లోనే మైనారిటీలకు రక్షణ ఎక్కువ ఉందన్నారు. 1971లో బంగ్లాదేశ్ శరణార్థులకు ఇందిరాగాంధీ పౌరసత్వం

ఇచ్చారని గుర్తుచేశారు. అలాగే బిల్లుపై లేవనెత్తే ప్రతి ప్రశ్నకు సమాధానం చెబుతామని ఆయన హామీ ఇచ్చారు. బిల్లుపై జరిగే చర్చలో ప్రతిపక్షాలు కూడా పాల్గొనాలని, ఎవరూ వాకౌట్ చేయొద్దని అమిత్‌షా విజ్ఞప్తి చేశారు. దేశవిభజనకు కాంగ్రెసే కారణమన్నారు. మతం ఆధారంగా దేశాన్ని కాంగ్రెస్ విభజించకుంటే.. ఇప్పుడు ఇలాంటి పౌరసత్వ బిల్లును తీసుకురావాల్సి వచ్చేది కాదన్నారు. పౌరసత్వ సవరణ బిల్లు ఆర్టికల్ 11, ఆర్టికల్ 14లను ఉల్లంఘిస్తోందని విపక్షాలు ఆందోళన చేపట్టాయి. అయితే ఆ ఆరోపణలను షా కొట్టిపారేశారు. మతం ఆధారంగా ప్రభుత్వం చట్టాలను చేసేందుకు ఆర్టికల్ 14 అడ్డుకోదని షా అన్నారు. 1971 తర్వాత బంగ్లాదేశ్ నుంచి వచ్చిన వారికి మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఎలా పౌరసత్వాన్ని కల్పించారో కేంద్ర మంత్రి తెలిపారు. మరి అప్పట్లో పాకిస్థాన్ వారికి ఎందుకు ఆ అర్హత కల్పించలేదని ఆయన ప్రశ్నించారు. రిజర్వేషన్లు కల్పించినప్పుడు ఆర్టికల్ 14 గుర్తుకు రాలేదా అని ఆయన విపక్షాలను ప్రశ్నించారు. పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్ దేశాలు ఇస్లాం మతాన్ని పాటిస్తున్నాయని, దేశ విభజన సమయంలో భారత్, పాక్‌లు మైనార్టీ రక్షణ కోసం ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు చెప్పారు. పౌరసత్వ సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టడానికి ఓటింగ్ జరిగింది. ఆ ఓటింగ్‌లో అనుకూలంగా 293 ఓట్లు పడ్డాయి, వ్యతిరేకంగా 82 మంది సభ్యులు ఓటేశారు. అంతకు ముందు చర్చలో భాగంగా పలు పార్టీలకు చెందిన సభ్యులు తమ అభిప్రాయాల్ని వ్యక్తం చేశారు. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన సౌగతా రాయ్ బిల్లుని వ్యతిరేకించారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని అభిప్రాయపడ్డారు. అధికరణ 14ని ఉల్లంఘిస్తోందన్నారు. ఈ బిల్లు దేశనిర్మాతల ఆకాంక్షలకు విరుద్ధంగా ఉందన్నారు. రాజ్యాంగ మౌలిక స్వరూపానికి ఇది విరుద్ధంగా ఉందని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్, రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీకి చెందిన ఎంపీ ప్రేమచంద్రన్ అభిప్రాయపడ్డారు. అనంతరం హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ.. ఇలాంటి బిల్లుల నుంచి దేశాన్ని, హోంమంత్రిని రక్షించాలని స్పీకర్‌ను కోరుతున్నానన్నారు. ఈ సందర్భంగా ఓవైసీ కొన్ని అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలను స్పీకర్ రికార్డుల నుంచి తొలగించారు. అంతకుముందు కాంగ్రెస్ లోక్‌సభాపక్ష నేత అధీర్ రంజన్ చౌధరి మాట్లాడుతూ..మైనారిటీలను లక్ష్యంగా చేసుకునే ఈ బిల్లుని తీసుకువచ్చారని ఆరోపించారు. ఈ బిల్లు అధికరణ 5, 15లకు వ్యతిరేకమన్నారు. సమానత్వ హక్కుకు ఇది వ్యతిరేకంగా ఉందన్నారు. దేశంలో ఎక్కడైనా నివసించే హక్కు రాజ్యాంగం కల్పించిందని వ్యాఖ్యానించారు.

విప్ జారీ చేసిన టీఆర్ఎస్...

పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్ఘనిస్థాన్‌లలో మత వివక్ష కారణంగా వలసవచ్చిన ముస్లిమేతరు లకు పౌరసత్వం కల్పించేందుకు ఉద్దేశించిన పౌరసత్వ బిల్లును హోం మంత్రి అమిత్ షా దిగువ సభలో ప్రవేశపెట్టనున్నారు. అయితే ఈ కీలక బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయాలని టీఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్ర సమితి) ఎంపీలకు ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు పార్లమెంట్ సభ్యులకు విప్ జారీచేసింది. బిల్లుపై చర్చ సందర్భంగా సోమ, మంగళవారం పార్లమెంట్‌కు తప్పకుండా హాజరుకావాలని పార్టీ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంపీలకు సూచించారు. కాగా వివాదస్పద పౌరసత్వ బిల్లును కాంగ్రెస్, వామపక్షలు, టీఆర్ఎస్‌తో పాటు ఎన్డీయేతర పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. అయితే లోక్‌సభలో అధికార బీజేపీకి స్పష్టమైన మెజార్టీ ఉండటంతో ఓటింగ్‌లో ఎలాంటి ఇబ్బంది ఉండకపోచ్చని తెలుస్తోంది. ఎగువ సభలో మిత్రపక్షాల మద్దతును బీజేపీ కూడగొట్టాల్సి ఉంది. ఈ నేపథ్యంలో బీజేపీ తమ పార్టీకి చెందిన లోక్‌సభ సభ్యులకు విప్ జారీ చేసింది. సోమవారం నుంచి మూడు రోజులపాటు సభకు తప్పని సరిగా హాజరు కావాలని ఆదేశించింది.

## గాంధీ ఆస్పత్రిలో..

# మృతదేహాలను భద్రపర్చండి

- ఏసీ వాహనంలో మహబూబ్‌నగర్ నుంచి తరలించండి
- 12కు తదుపరి విచారణ చేపడుతాం
- ఎన్‌కౌంటర్ జరిగిన తీరుపై ఆధారాలు సమర్పించండి
- అడ్వొకేట్ జనరల్‌ను ఆదేశించిన హైకోర్టు

హైదరాబాద్, డిసెంబర్10(ఆర్ఎన్ఎ) : దిశ హత్యాచారం కేసులో నిందితుల మృతదేహాలను గాంధీ ఆస్పత్రిలో భద్రపర్చాలని హైకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. దిశ హత్యాచారం కేసులో నిందితుల ఎన్‌కౌంటర్‌పై దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు ధర్మాసనం సోమవారం మధ్యాహ్నం 2:30 గంటలకు విచారణ చేపట్టింది. ఈ మేరకు శుక్రవారం వరకు గాంధీ ఆస్పత్రిలో మృతదేహాలను భద్రపరచాలని హైకోర్టు అధికారులను ఆదేశించింది. తదుపరి విచారణను గురువారానికి న్యాయస్థానం వాయిదా వేసింది. మహబూబ్‌నగర్ నుంచి ఏసీ వాహనాల్లో గాంధీ ఆస్పత్రికి తరలించాలని హైకోర్టు సూచించింది. ఘటన జరిగిన సాయంత్రం ప్రజా సంఘాలు లేఖ రాస్తూ ఈ అంశంలో జోక్యం చేసుకోవాలని హైకోర్టును కోరాయి. ఆ లేఖనే ఉన్నత న్యాయస్థానం ప్రజా ప్రయోజన వ్యాజ్యంగా పరిగణనలోకి తీసుకుంది. దీంతో పాటు రాఘవేంద్ర ప్రసాద్ అనే న్యాయవాది కూడా ఇదే అంశంపై ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ రెండింటినీ కలిపి హైకోర్టు సోమవారం విచారణకు స్వీకరించింది. ఎన్‌కౌంటర్ విషయంలో గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను పాటించారా? లేదా? అని అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్‌ను హైకోర్టు ప్రశ్నించింది. దీనిపై ఆయన స్పందిస్తూ అంతా మార్గదర్శకాల ప్రకారమే జరిగిందని వివరణ ఇవ్వగా.. ఆధారాలు సమర్పించాలని ఆదేశించింది. ఇదే అంశంపై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగిందని, తదుపరి విచారణను అత్యున్నత న్యాయస్థానం బుధవారానికి వాయిదా వేసినందున ఇప్పుడు హైకోర్టులో విచారణను గురువారానికి వాయిదా వేయాలని ఏజీ కోరారు. దీనికి అంగీకరించిన హైకోర్టు.. తదుపరి విచారణను 12కు (గురువారం) వాయిదా వేసింది. మరోవైపు ప్రజాసంఘాల లేఖను ప్రజాప్రయోజన వ్యాజ్యంగా స్వీకరించినందున విచారణలో కోర్టుకు సహకరించేందుకు సీనియర్ న్యాయవాది, మాజీ అడ్వొకేట్ జనరల్ దేశాయి ప్రకాశ్‌రెడ్డిని అమికస్ క్యూరీగా ఉన్నత న్యాయస్థానం నియమించింది.

### మృతుల కుటుంబీకుల ఆందోళన..

ఇదిలా ఉంటే తమ వారి మృతదేహాలను వెంటనే తమకు అప్పగించాలని కోరుతూ మృతుల కుటుంబ సభ్యులు సోమవారం మహబూబ్‌నగర్ ప్రభుతాస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. ఎన్‌కౌంటర్ జరిగిన రోజు సాయంత్రం మృతదేహాలను మహబూబ్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. వాటిని కుటుంబ సభ్యులకే అందజేసేందుకు అధికారులు సిద్ధమైన క్రమంలో హైకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వాస్పత్రిలో భద్రపర్చారు. తెల్లారి మహబూబ్‌నగర్ మెడికల్ కళాశాలలో మృతదేహాలను భద్రపర్చారు. కాగా మృతుల కుటుంబ సభ్యులు గత రెండు రోజులుగా తమవారి మృతదేహాలను తమ అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు. తాజాగా సోమవారం ప్రభుత్వాస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు.

# ఆకాశాన్ని అంటుతున్నపెట్రోల్, డీజిల్ ధరలు

న్యూఢిల్లీ,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): పెట్రోల్, డీజిల్ ధరలు గత మూడు వారాలుగా పెరుగుతూనే ఉన్నాయి. రోజుకు 3 పైసలు 5పైసలు పెరుగుదలతో ఇప్పుడు 80 రూపాయలకు దగ్గరలో ఉన్నాయి. దీంతో హైదరాబాద్ లో లీటర్ పెట్రోల్ ధర రూ.79.81 వద్దకు చేరగా, డీజిల్ ధర రూ.72.07కు చేరుకుంది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు మిశ్రమంగా తగ్గాయి. ఇంకా వివిధ మెట్రో నగరాల్లో ఈరోజు పెట్రోల్, డీజిల్ ధరలు ఇలానే కొనసాగుతున్నాయి. అమరావతిలో 20 పైసలు పెరుగుదలతో పెట్రోల్ ధర 79.47 రూపాయలకు దగ్గరకు చేరగా, డీజిల్ ధర కూడా 16 పైసలు పెరుగుదలతో 71.25 వద్ద స్థిరంగా కొనసాగుతుంది. విజయవాడలోనూ ఈ పెట్రోల్, డీజిల్ ధరలు ఇలానే కొనసాగుతున్నాయి. పెట్రోల్ ధర 78.90 రూపాయలకు చేరగా.. డీజిల్ ధర కూడా 5 పైసలు పెరుగుదలతో 70.80పైసల్ వద్దకు చేరింది. ఇక దేశ రాజధాని ఢిల్లీలోనూ పెట్రోల్ , డీజిల్ ధరలు ఇలాగే కొనసాగుతున్నాయి. పెట్రోల్ ధర 74.66 రూపాయిల దగ్గర, డీజిల్ ధర 65.73 రూపాయిల వద్ద కొనసాగుతుంది. కాగా ఆర్థిక రాజధాని అయినా ముంబైలో కూడా పెట్రోల్, డీజిల్ ధరలు ఇలానే కొనసాగుతున్నాయి. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు మిశ్రమంగా తగ్గాయి. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 0.03 శాతం తగ్గుదలతో 62.35 డాలర్లకు క్షీణించింది.అయితే గత మూడు వారాలుగా పెట్రోల్, డీజిల్ ధరలు రోజుకు 10, 15 పైసల్ పెరుగుదలతో 4 రూపాయిలు పెరిగింది. పైసలు రూపంలో పెరుగుదల వాహనదారులకు కనిపించడం లేదు కానీ నిజానికి పెట్రోల్, డీజిల్ ధరలు రోజురోజుకు పెరుగుతూ వస్తున్నాయి. ఇప్పుడు కేవలం మూడు వారాలలో 80 రూపాయిలు అయ్యింది. ఇలాగె ఉంటె ఇంకొక నెలలో లీటర్ పెట్రోల్ ధర 90 రూపాయిలు అవుతుంది. మరి ఈ పెట్రోల్, డీజిల్ ధరలు ఎప్పుడు తగ్గుతాయో చూడాలి.

# లమిచ్చనేను చూసీ నేర్చుకొండి

ఇస్లామాబాద్,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): నేపాలీ స్పిన్ సెన్సేషన్ సందీప్ లమిచ్చనేను చూసి నేర్చుకోవాలంటూ పాక్ క్రికెటర్లు మొహమ్మద్ ఆమీర్, వాహబ్ రియాజ్‌లపై అభిమానులు మండిపడుతున్నారు. లమిచ్చనే 2018లో తొలిసారి ఐపీఎల్‌లో ఢిల్లీ తరపున ఆడాడు. ఆ తర్వాత ఆస్ట్రేలియా బిగ్‌బాస్ లీగ్, కరీబియన్ ప్రీమియర్ లీగ్, బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్, పాకిస్థాన్ సూపర్ లీగ్‌లలో ఆడాడు. టీ20లు ఆడడం ఆనందంగానే ఉన్నా.. నేపాల్ తరపున ఒక్క టెస్టు మ్యాచ్ ఆడితే ఇచ్చే కిక్కే వేరన్నాడు. అది తనకు ఎంతో సంతృప్తిని ఇస్తుందని పేర్కొన్నాడు. ఫ్రాంఛైజీ క్రికెట్ ఆడడం నాకు చాలా ఇష్టం. ఇలాంటివి వందలాది గేమ్‌లు ఆడినా నాకు వ్యక్తిగతంగా సంతృప్తిని ఇవ్వవు. అదే, నేపాల్ తరపున ఒక్క టెస్టు మ్యాచ్ ఆడినా బోల్డంత సంతృప్తి లభిస్తుంది' అని లమిచ్చనే చెప్పినట్టు పాకిస్థాన్ జర్నలిస్ట్ సాజ్ సాదిక్ పేర్కొన్నాడు. ఇది చూసిన పాకిస్థాన్ అభిమానులు ఫాస్ట్ బౌలర్లు మహ్మద్ ఆమిర్, వాహబ్ రియాజ్‌లపై మండి పడుతున్నారు. ఆమిర్ ఈ ఏడాది మొదట్లో టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించగా, టెస్టుల నుంచి వాహబ్ నిరవధిక విరామం తీసుకున్నాడు. లమిచ్చనే వ్యాఖ్యల తర్వాత పాక్ ఫ్యాన్స్ తమ సొంత ఆటగాళ్లు ఆమిర్, రియాజ్‌లపై విరుచుకు పడుతున్నారు. సందీప్ తన దేశం కోసం ఒక్క టెస్టు మ్యాచ్ అయినా ఆడాలని పరితపిస్తుంటే తమ నేషనల్ హీరోలు ఆమిర్, రియాజ్‌లు ఫ్రాంఛైజీ క్రికెట్‌పై దృష్టిపెట్టి టెస్టుల నుంచి తప్పుకున్నారని విమర్శిస్తున్నారు. తమ సో కాల్డ్ సూపర్ స్టార్లు యువ ఆటగాడు సందీప్‌ను చూసి నేర్చుకోవాలని చురకలు అంటిస్తున్నారు

# లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలిగించాలి

## ఢిల్లీ రాంలీలా మైదానంలో ఆదివాసీల సభ

## భారీగా తరలివచ్చిన గిరిజనం

న్యూఢిల్లీ,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): ఆదివాసీల సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఆదివాసీల అస్తిత్వ పోరాట సభను నిర్వహించారు. ముఖ్యంగా లంబాడాల ను ఎస్టీ జాబితా నుంచి తొలగించడం, పోడు భూములకు పట్టాలు కల్పించడం, ఏజెన్సీ ప్రాంతాల్లో నకిలీ ధ్రువ పత్రాలను అరికట్టాలనే డిమాండ్‌లతో ఈ సభ జరిగింది. ఈ సభలో తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు మాట్లాడుతూ.. ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం కల్పించిన ఆదివాసీల హక్కులను కేంద్ర ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరారు. 1976 ఎమ్జర్జన్సీ సమయంలో నిబంధనలకు విరుద్ధంగా లంబాడాలను ఎస్టీ జాబితాలో చేర్చారన్నారు. లంబాడాలను ఎస్టీ జాబితాలో చేర్చడంతో ఆదివాసీలు నష్ట పోతున్నారని ఆయన పేర్కొన్నారు. లంబాడాలను ఎస్టీ జాబితాలో కలపడం వలన ఆదివాసీ యువత విద్య, ఉపాధి కోల్పోతున్నారని అన్నారు. ఎస్టీ రిజర్వేషన్లలో 97శాతం లంబాడాలే అనుభవిస్తున్నారని సోయం బాపూరావు అన్నారు. రాజ్యాంగ లోని ఆర్టికల్ 342 ప్రకారం చట్టబద్ధత లేని సుగాలీలు, లంబాడి కులాలను తెలంగాణ రాష్ట్రంలో ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఎస్టీ రిజర్వేషన్ల కోసం వివిధ రాష్ట్రాల నుంచి లంబాడాలు తెలంగాణకి వలస వస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. అప్పట్లో లక్షా ఇరవై వేలు ఉన్న జనాభా ఎప్పుడు 20 లక్షలకు చేరుకుందన్న విషయాన్ని ప్రభుత్వాలు గమనించాలన్నారు. లంబాడాల వల్ల ఆదివాసీలు భూములు, ఉద్యోగాలు, విద్యా అవకాశాలు కోల్పోతున్నారన్నారు.

ఆదివాసుల హక్కుల కోసం పార్లమెంటులో రాజీలేని పోరాటం చేస్తానని ఈ సందర్భం గా ఆయన తెలిపారు. ఈ బహిరంగ సభకు ఆదివాసీ మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, ఆదివాసీ సంఘాల నాయకులు, తెలంగాణ రాష్ట్రంతో పాటు దేశంలోని ఆయా ప్రాం తాల ఆదివాసీ గిరిజనులు తరలి వచ్చారు.

# ఐటి కారిడార్ కోసం భూముల పరిశీలన

హైదరాబాద్,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): శామీర్‌పేట మండలానికి మహర్దశ పట్టనుంది. ఐటీ కారిడార్‌లో భాగంగా శామీర్‌పేట మండలం, తూంకుంట మున్సిపాలిటీలో ప్రభుత్వ భూముల పరిశీలనలో రెవెన్యూ యంత్రాంగం నిమగ్నమయ్యారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఎంవీ. రెడ్డి, టీఎస్ఐఐసీ ఎండీ, వైస్ చైర్మన్ ఈవీ. నర్సింహ్మారెడ్డిలు శామీర్‌పేట, తూంకుంట మున్సిపాలిటీ దేవరయాజాంల్, మేడ్చల్, కుత్బుల్లాపూర్ మండలాల్లో ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఐటీ లాజిస్టిక్ హబ్ ఏర్పాటు కోసం జిల్లా యంత్రాంగం ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఐఐసీ ఎండీ, వైస్ చైర్మన్ ఈవీ.నర్సింహ్మారెడ్డి, అధికారులు, ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ గోవర్ధన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో పత్తి కొనుగోళ్లలో మోసాలు

## గిట్టుబాటు దక్కక రైతుల ఆందోళన

జగిత్యాల,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): జిల్లాలోని గొల్లపల్లి మండల కేంద్రంతో పాటు వెల్గటూర్ మండలంలోని కొత్తపేటలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని భావించారు. గతంలో గొల్లపల్లిలో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రానికి అంతగా పత్తి రాకపోవడంతో ఈసారి కేవలం వెల్గటూర్ మండలం కొత్తపేటలోనే సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. నిబంధనల పేరిట కొత్తపేట సీసీఐ కొనుగోలు కేంద్రంలో అధికారులు ఇప్పటివరకు కేవలం 3585.40 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారు. అధికారుల లెక్కల ప్రకారం ప్రైవేట్ వ్యాపారులు 6,605 క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఇంకా 90 వేల క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. 8 శాతంకన్నా తేమ ఎక్కువగా ఉందంటూ కొత్తపేటలోని సీసీఐ కొనుగోలు కేంద్రం అధికారులు తిప్పి పంపుతున్నారు.

కొందరు ఆదిలాబాద్ జిల్లాలోని భైంసాకు వెళ్లి విక్రయించుకుంటున్నారు. జిల్లాలో దాదాపు 18 వేల మంది రైతులు పత్తి పంట సాగు చేయగా, అధికారుల లెక్కల ప్రకారం లక్ష క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఇప్పటివరకు సీసీఐతో పాటు ప్రైవేట్ వ్యాపారులు 10 వేల క్వింటాళ్లు కూడా పంట కొనుగోలు చేయలేదు. ఇంకా 90 శాతం పంట రైతుల వద్దే ఉంది. కొడిమ్యాల మండలంలోని హిమ్మత్‌రావుపేటలో శనివారం దళారులు పత్తి పంటను కొనుగోలు చేయగా, తూకంలో తేడాలు వచ్చాయి.

# డిసెంబర్ 19న హైదరాబాద్ లో ప్రాంతీయ డాక్ అదాలత్

హైదరాబాద్, డిసెంబర్ 10:తపాలా సేవల కు సంబంధించి ప్రజల ఫిర్యాదుల ను మరియు సమస్యల ను తెలుసుకొనేందుకు 2019 డిసెంబర్ 19 తేదీన మధ్యాహ్నం 3 గంటల కు హైదరాబాద్ లోని ఆబిడ్స్ లో గల డాక్ సదన్ లో డాక్ అదాలత్ ను నిర్వహించనున్నట్లు తపాలా విభాగం లోని చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ హెడ్ క్వార్టర్ రీజియన్, హైదరాబాద్ కార్యాలయం తెలిపింది. తెలంగాణ రాష్ట్రం లోని ప్రజలు వారి ఫిర్యాదులను మరియు సమస్యలను లిఖితపూర్వకం గా పొందుపరచి తపాలా కవర్ లో 2019 డిసెంబర్ 12వ తేదీ లోపు తెలియజేయవచ్చు. కవర్ పైన 'డాక్ అదాలత్' అనే పదాలు రాసి శ్రీ కె. సంతోష్ నేతా, అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్ జనరల్, ఆఫీస్ ఆఫ్ ది పోస్ట్ మాస్టర్ జనరల్, హెడ్ క్వార్టర్ రీజియన్, హైదరాబాద్– 500001 చిరునామా కు పంపాలని ప్రకటన లో కోరారు.

# మెక్సికో లో నవంబర్ 30 నుండి డిసెంబర్ 02 వరకు జరిగిన వైస్ ఛాన్సలర్ల సదస్సు

## సదస్సు కు ప్రాతినిధ్యం వహించిన ఇఫ్లూ వైస్ ఛాన్సలర్ సురేష్ కుమార్

హైదరాబాద్, డిసెంబర్ 10:నవంబర్ 30 నుండి 2019 డిసెంబర్ 02 వరకు మెక్సికో లో జరిగిన వైస్ ఛాన్సలర్ల సమావేశంలో ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్శిటీ (ఇఫ్ఎల్‌యు) వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఇ సురేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సమావేశం భారత విశ్వవిద్యాలయాల సంఘం (ఏఐయు), నేషనల్ అసోసియేషన్ ఆఫ్ యూనివర్శిటీస్ అండ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్ ఆఫ్ మెక్సికో (ఏఎన్యుఐఇఎస్) సంయుక్తం గా నిర్వహించాయి.ఆవిష్కరణలపై అనుభవాలను పంచుకోవడానికి, ఈ సదస్సులో పాల్గొంటున్న దేశాలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం, ఆలోచనలు విస్తరించడానికి వైస్ ఛాన్సలర్ల యొక్క ప్రత్యేక బృందానికి ఒక సాధారణ వేదికను అందించడం ఈ సమావేశం యొక్క లక్ష్యం. ఈ సమావేశం రెండు దేశాల విశ్వవిద్యాలయాల మధ్య అంతర్జాతీయ విద్యా సహకారాన్ని సులభతరం చేయడానికి ఉద్దేశించబడింది.ఈ సందర్భంగా, ఇంగ్లీష్ మరియు ఫారిన్ లాంగ్వేజెస్ విశ్వవిద్యాలయం మెక్సికోలోని అటానమస్ యూనివర్శిటీ ఆఫ్ సినాలోవా తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యం ద్వారా విశ్వవిద్యాలయాలు విద్యా, పరిశోధన, విద్యార్థి మరియు అధ్యాపకుల మార్పిడి కార్యక్రమాలలో సహకరిస్తాయి. అవగాహన ఒప్పందం జాతీయ మరియు అంతర్జాతీయ ప్రసంగాలు, సమావేశాలు, ప్రత్యేక ప్రదర్శనలు మరియు ఉమ్మడి పరిశోధన ప్రాజెక్టుల నిర్వహణకు వీలు కల్పిస్తుంది.తన పర్యటనలో భాగంగా ప్రొఫెసర్ సురేష్ కుమార్ శాన్ జోస్ లోని శాన్ జోస్ స్టేట్ యూనివర్శిటీని సందర్శించారు; బోధన, విద్యా పరిశోధనలలో కొత్త పోకడలను అన్వేషించడానికి యునైటెడ్ స్టేట్స్ లోని స్టాన్ఫోర్డ్ విశ్వవిద్యాలయం సందర్శించారు. ప్రొఫెసర్ కుమార్ విద్యావేత్తల నాణ్యతను మెరుగు పరచడానికి మరియు విశ్వవిద్యాలయ విద్యార్థులు మరియు ఉపాధ్యాయులకు ఎక్కువ అవకాశాలను కల్పించడానికి ప్రపంచ భాగస్వామ్యాల ప్రాముఖ్యత అవసరం ఉందన్నారు.

# పంపిణీకి సిద్ధంగా క్రిస్మస్ కానుకలు

## నియోజకవర్గానికి వేయి ప్యాకెట్లు

## రూ.2 లక్షలు కేటాయించిన ప్రభుత్వం

ఆదిలాబాద్,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్న తెలంగాణ ప్రభుత్వం క్రిస్మస్ పర్వదినానికి గిఫ్టులను ఇచ్చేందుకు రంగం సిద్ధంచేసింది. ప్రతి ఏడాది ఈ కానుకలను అందిస్తున్నది. తెలంగాణ ప్రభుత్వం క్రిస్మస్‌ను పురస్కరించుకొని ప్రతి ఏడాది పండుగ కానుకలు అందిస్తున్న విషయం తెలిసిందే.ఈ ఏడాది సైతం క్రిస్మస్ కానుకలు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కానుకలు జిల్లాకు చేరాయి. నియోజకవర్గానికి వెయ్యి చొప్పన ఆదిలాబాద్, బోథ్ మొత్తం రెండు వేల గిఫ్టులు త్వరలో పంపిణీ చేసేందుకు మైనార్టీ సంక్షేమశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. అధికారులతో ఏర్పాటు చేసిన కమిటీలు, చర్చీల నిర్వాహకులు పంపిణీ చేయనున్నారు. సామూహిక భోజనాల కోసం నియోజకవర్గానికి రూ.2 లక్షల చొప్పన నిధులు మంజూరయ్యాయి. ఉమ్మడి జిల్లాలో క్రిస్మస్ కానుకలు పంపిణీ చేసేందుకు మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పంపిణీ పూర్తి చేయనున్నారు. ఒక్కో నియోజకవర్గానికి వెయ్యి కానుకలతో పాటు రూ.2 లక్షలు చొప్పున మూడు నియోజవర్గాలకు మొత్తం రూ.4 లక్షలతో సామూహిక భోజనాలు ఏర్పాటు చేయనున్నారు. కమిటీలు, చర్చీల నిర్వాహకులు వీటి కోసం ఏర్పాట్లు చేయనున్నారు. ఇందుకు సంబంధించి నిధులు క్రిస్టియన్ సెలబ్రేషన్ ఆర్గనైజింగ్ కమిటీ అందజేయనున్నది. తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డు ఉండి సమీప చర్చీల పాస్టర్లు ధ్రువీకరించిన లెటర్ ప్యాడ్‌పై అభ్యర్థుల పేర్లను రాసి కమిటీకి పంపించాల్సి ఉంటుంది. ఆ తరువాత చర్చీల వారీగా లబ్దిదారుల సంఖ్య ప్రకారం గిఫ్టు పాకెట్లను పంపిణీ చేస్తారు.

# పత్తిరైతులను మోసం చేస్తున్న దళారులు

## –సిసిఐ కొనుగోలు చేసింది తక్కువే: తమ్మినేని

వరంగల్,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): మార్కెట్లో పత్తి రైతులను నిలువునా మోసం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. మద్దతు ధరలు ఇవ్వకుండా తేమ పేరుతో మోసం చేస్తున్నారని అన్నారు. పత్తి ధరలను తగ్గించి మధ్య దళారీలు పత్తిని కొనుగోలు చేస్తున్నారని, ఇప్పటివరకు భారత కాటన్ కార్పొరేషన్ చాలా తక్కువకు పత్తిని కొనుగోలు చేస్తోందని ఆరోపించారు. నాణ్యత లేదనే పేరుతో సిసిఐ, పత్తిని తిరస్కరిస్తే.. దళారీలు అదే పత్తిని తక్కువ రేట్లకు కొంటూ.. నాణ్యత పేరుతో తిరిగి సిసిఐ కి ఆ పత్తిని అమ్మి అక్రమ సంపాదన చేస్తున్నారని ఆరోపించారు. వరంగల్ మార్కెట్ యార్డును సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సోమవారం ఉదయం సందర్శించారు. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం మీడియాతో మాట్లాడుతూ... ఐకేపి కేంద్రాలన్నీ ధాన్యం కొనుగోలుకు అశాస్త్రీయ నాణ్యతా ప్రమాణాలను చెబుతూ ధాన్యం కొనుగోలును నిరాకరిస్తున్నాయని, దీని వల్ల రైతులు పెద్ద ఎత్తున నష్టపోతున్నారని ఆగ్రహాన్ని వ్యక్తపరిచారు. ప్రభుత్వం ప్రకటించిన వ్యవసాయోత్పత్తుల ధరలను అమలు చేసే విధంగా యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ఏ రైతులూ నష్టపోకుండా ప్రకటించిన ధరలకే వ్యవసాయోత్పత్తులను కొనాలని డిమాండ్ చేశారు. పత్తి కొనుగోలుపై త్వరలోనే అధికారులను, రైతులను అడిగి వివరాలను తెలుసుకుంటామని, పత్తిని మార్కెట్‌కు తెచ్చే రైతులకు కల్పిస్తున్న మౌలిక వసతులను పరిశీలిస్తామని తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు.

# తల్లీపిల్లల ఆత్మహత్యలో భర్త అరెస్ట్

నాగర్‌కర్నూల్,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకున్న నిహారిక కేసులో ఆమె భర్త, అత్తను పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 7న నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో కూతురు మణిదీప్తి(4), కుమారుడు కేధరినాథ్(ఏడాదిన్నర) లపై కిరోసిన్ పోసి నిప్పంటించిన నిహారిక తాను కూడా ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. నిహారిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆమె భర్త మహేశ్ యాదవ్, అత్త మంగమ్మలను అరెస్టు చేశారు.

## ఏప్రిల్ నుంచి..

# రాష్ట్రమంతా నాణ్యమైన బియ్యం

**- తమ మేనిఫెస్టోలో ఎక్కడా సన్నబియ్యం అంశమే లేదు**
**- టీడీపీ సభ్యులు కళ్లద్దాలు సరిచేసుకొని తమ మేనిఫెస్టో చదవండి**
**- గతంకన్నా రూ.1400కోట్లను అధికంగా ఖర్చు చేయబోతున్నాం**
**- సాక్షిలో అర్థంచేసుకోకుండా తప్పుగా రాశారు**
**- అసెంబ్లీలో ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి**

అమరావతి, డిసెంబర్10(ఆర్ఎన్ఎ) : ఏప్రిల్ నుంచి రాష్ట్రమంతా నాణ్యమైన బియ్యం అందిస్తామని ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఏపీ అసెంబ్లీలో సన్న బియ్యంపై వాడీ-వేడి చర్చ జరిగింది. సన్న బియ్యం ఇస్తామని చెప్పి ప్రభుత్వం మాట తప్పిందని టీడీపీ సభ్యులు ప్రశ్నించారు.

కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చాలా సందర్భాల్లో సన్న బియ్యం ఇస్తామని చెప్పారని.. స్వయంగా ముఖ్యమంత్రి జగన్, మంత్రులతో సమీక్ష చేశారని మీడియాలో వచ్చిన కథనాలను చూయించారు. సన్న బియ్యం హామీ ఏమయ్యిందని ప్రశ్నించారు. దీంతో పౌరసరఫరాల శాఖ మంత్రి నాని, టీడీపీ సభ్యుల మధ్య మాటల యుద్ధం సాగింది. అనంతరం సీఎం జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ మేనిఫెస్టోలో ఎక్కడా సన్న బియ్యం అన్న అంశమే లేదని స్పష్టం చేశారు. బియ్యం విషయంలో చెప్పని అంశాన్ని కూడా వేం చేసిచూపిస్తున్నామన్నారు. టీడీపీ సభ్యులు కళ్లద్దాలు సరిచేసుకొని మేనిఫెస్టోను చదవాలని, వాళ్లకు మేనిఫెస్టో చదవడం రాదు అంటూ ఎద్దేవా చేశారు. ప్రజలు ఎక్కడ కొడతారోనని టీడీపీ మేనిఫెస్టో వెబ్‌సైట్ నుంచి తీసేశారని, తాము మాత్రం ఈ మేనిఫెస్టో చూపించి ఓట్లు అడిగామని జగన్ అన్నారు. ఫలానా తరహా బియ్యం ఇస్తామని మేనిఫెస్టోలో చెప్పలేదని జగన్ అన్నారు. స్వర్ణ రకాన్నే సన్నబియ్యం అంటారని.. తాము ఇచ్చే బియ్యంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. నాణ్యమైన బియ్యం, సన్న బియ్యం తేడా తెలియకుండా సాక్షి పేపర్‌లో తప్పుగా రాశారని, గతంలో రేషన్ బియ్యం ఎవరూ తినలేని పరిస్థితి ఉండేదన్నారు. శ్రీకాకుళం జిల్లా పైలట్ ప్రాజెక్ట్‌గా నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేస్తున్నామని, శ్రీకాకుళం జిల్లాలో పంపిణీ చేస్తున్న బియ్యాన్ని పరిశీలించాలన్నారు. సన్నబియ్యం అన్న పేరే లేదని.. సన్న బియ్యం అంటే ఏంటో తెలుసుకుంటే నాలెడ్జ్ పెరుగుతుందని జగన్ అన్నారు. సన్న బియ్యం ఇస్తామని ఎక్కడా చెప్పలేదని సీఎం అన్నారు. రేషన్ బియ్యంకోసం గతంకన్నా రూ.1400కోట్లను అధికంగా ఖర్చు చేయబోతున్నామని సీఎం తెలిపారు. మంచి బియ్యం కాబట్టే రాష్ట్రమంతా ఇవ్వాలని టీడీపీ సభ్యులు అడుగుతున్నారని.. స్వర్ణ రకమైన నాణ్యమైన బియ్యాన్నే అందించబోతున్నామని చెప్పారు. ఏప్రిల్ నుంచి రాష్ట్రమంతా నాణ్యమైన బియ్యాన్ని అందిస్తామని తెలిపారు. టీడీపీ నేతలు పిచ్చాసుపత్రికి వెళితే కానీ నయం కాదు అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. దీంతో టీడీపీ సభ్యులు జగన్ వ్యాఖ్యలపై అభ్యంతరం తెలిపారు. అనంతరం ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన మాట్లాడుతూ.. నాణ్యమైన బియ్యంపై గౌరవ ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేసినా, విపక్షం అర్థం లేని విమర్శలు చేస్తోందని మండిపడ్డారు. టీడీపీ హయాంలో బియ్యం పంపిణీ కోసం 2018-19లో రూ.3 వేల కోట్లు కేటాయించి కేవలం రూ.200 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని తెలిపారు. తమ ప్రభుత్వం ప్రజలు తినగలిగే విధంగా నాణ్యమైన బియ్యం సరఫరా కోసం రూ.4134 కోట్లు కేటాయించిందన్నారు. గత 5 ఏళ్లలో పౌర సరఫరాల సంస్థను ఏ విధంగా నిర్వీర్యం చేశారన్నది చూస్తే.. ఇవాళ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థకు మొత్తం రూ.20 వేల కోట్ల అప్పులున్నాయి అన్నారు. గత ప్రభుత్వం 5 ఏళ్లలో రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ తరఫున రూ.13,500 కోట్ల అప్పు చేసిందన్నారు మంత్రి. అప్పు తీసుకున్న నిధుల్ని వేరే అవసరాల కోసం ఉపయోగించారని.. అలాగే బియ్యం సరఫరా కోసం గత ఏడాది బడ్జెట్‌లో రూ.3 వేల కోట్లు కేటాయించి, కేవలం రూ.200 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని తెలిపారు. ఇప్పుడు తమ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని.. అసలు వారికి రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ, నాణ్యమైన బియ్యం గురించి మాట్లాడే హక్కు ఉందా అంటూ మండిపడ్డారు.

# అమిత్ షాపై అమెరికా ఆంక్షలు!

**- పౌరసత్వ బిల్లుపై యూఎస్ కమిషన్ కీలక వ్యాఖ్యలు**

వాషింగ్టన్, డిసెంబర్10(ఆర్ఎన్ఎ) : పౌరసత్వ చట్ట సవరణ బిల్లుపై అమెరికాకు చెందిన యునైటెడ్ స్టేట్స్ కమిషన్ ఆన్ ఇంటర్నేషనల్ రిలీజియస్ ఫ్రీడమ్ (యూఎస్‌సీఐఆర్ఎఫ్) కీలక వ్యాఖ్యలు చేసింది.

మతప్రాదికన తయారుచేసిన ఈ బిల్లు తీవ్ర ఆందోళన కలిగించే విషయమని పేర్కొంది. అలాగే రెండు సభల్లో బిల్లు ఆమోదం పొందినట్లయితే హోంమంత్రి అమిత్ షా సహా, ఇతర కీలక నాయకత్వంపై ఆంక్షల్ని విధించే అంశాన్ని పరిశీలించాలని సూచించింది. ఈ బిల్లుని 'తప్పుడు దిశలో వెళుతున్న ప్రమాదకరమైన మలుపు'గా అభివర్ణించింది. భారతదేశానికి ఉన్న ఘనమైన లౌకిక చరిత్రకు, రాజ్యాంగంలో కల్పించిన సమానత్వపు హక్కుకు ఇది వ్యతిరేకంగా ఉందని అభిప్రాయపడింది. అసోంలో చేపట్టిన ఎన్ఆర్‌సీ పక్రియపైనా ఇటీవల యూఎస్‌సీఐఆర్ఎఫ్ ఆందోళన వ్యక్తం చేసింది. అయితే ఈ బిల్లు వల్ల దేశంలోని ఏ ఒక్క పౌరుడు తమ పౌరసత్వం కోల్పోరని లోక్‌సభలో చర్చ సందర్భంగా హోంమంత్రి అమిత్ షా భరోసా కల్పించిన విషయం తెలిసిందే. బిల్లుకు దేశంలోని 130కోట్ల మంది పౌరుల మద్దతు ఉందని ఉద్ఘాటించారు. ఈ బిల్లు ముస్లిం సోదరులకు ఏమాత్రం వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. ఎట్టకేలకు సోమవారం బిల్లు సుదీర్ఘ చర్చ అనంతరం లోక్‌సభ ఆమోదం పొందింది. మన అంతర్గత విషయాల్లో ఇతర దేశాలు, అంతర్జాతీయ సంస్థల నివేదికలు, అభిప్రాయాల్ని పరిగణించబోమని యూపీఏ హయాం నాటి నుంచే భారత్ స్పష్టం చేస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో భారత్‌లో మతస్వేచ్ఛపై సమీక్ష కోసం వచ్చే యూఎస్‌సీఐఆర్ఎఫ్ సభ్యులకు వీసా కూడా తిరస్కరిస్తూ వస్తున్నారు. అయితే తాజాగా యూఎస్‌సీఐఆర్ఎఫ్ సిఫార్సులు కచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఏమీ ఉండదు.

# క్యాబ్.. భారత రాజ్యాంగంపై దాడి: రాహుల్ గాంధీ



హైదరాబాద్:, డిసెంబర్ 10 పౌరసత్వ సవరణ బిల్లు(క్యాబ్)ను కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ వ్యతిరేకించారు. ఆ బిల్లు.. భారత రాజ్యాంగంపై దాడి అని ఆయన విమర్శించారు. ఇవాళ ట్విట్టర్‌లో రాహుల్ స్పందించారు. ఆ బిల్లుకు మద్దతు ఇచ్చేవాళ్లు.. మన దేశ వ్యవస్థీకృత విధానంపై దాడి చేస్తున్నట్లే అన్న అభిప్రాయాన్ని రాహుల్ వినిపించారు. పౌరసత్వ బిల్లుకు శివసేన పార్టీ మద్దతు ఇవ్వడం పట్ల రాహుల్ కొంత విస్మయాన్ని వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇటీవల మహారాష్ట్రలో కాంగ్రెస్, శివసేన, ఎన్సీపీ పార్టీలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. దేశ ప్రయోజనాల దృష్ట్యా పౌరసత్వ బిల్లుకు ఓకే చెప్పినట్లు శివసేన పేర్కొన్నది. కానీ రాహుల్ మాత్రం ఆ నిర్ణయాన్ని స్వాగతించడం లేదు. సోమవారం లోక్‌సభలో పౌరసత్వ బిల్లు 311 ఓట్లతో ఆమోదం పొందింది.

# వాతావరణ పరిస్థితులపై ఫడ్నవీస్‌తో చర్చించా : అజిత్ పవార్



ముంబయి, డిసెంబర్ 10 : మహారాష్ట్ర మాజీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ నాయకుడు అజిత్ పవార్ మరోసారి ఒకే వేదికను పంచుకున్నారు. సోమవారం సోలాపూర్ జిల్లాలో జరిగిన స్వతంత్ర ఎమ్మెల్యే సంజయ్ షిండే కుమార్తె వివాహానికి దేవేంద్ర ఫడ్నవీస్, అజిత్ పవార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా 20 నిమిషాల పాటు వారిద్దరూ పలు అంశాలపై చర్చించుకున్నారు. అయితే పెళ్లికి హాజరై తిరిగి వస్తున్న అజిత్ పవార్‌ను మీడియా పలుకరించగా.. పెళ్లికి హాజరైన నేపథ్యంలో ఇద్దరం కలిసి కూర్చున్నాం.. ఆ సమయంలో మహారాష్ట్రలో వాతావరణ పరిస్థితులు, వర్షపాతంపై చర్చించాం. రాజకీయాల్లో శాశ్వత శత్రువులెవరూ ఉండరు. అందుకే కలిసి కూర్చున్నాం. ఇద్దరం కలిసి వాతావరణ పరిస్థితులపై మాట్లాడు కోవడం తమకు సాధారణమే అని అజిత్ పవార్ స్పష్టం చేశారు. నవంబర్ 23వ తేదీన సీఎంగా దేవేంద్ర ఫడ్నవీస్, డిప్యూటీ సీఎంగా అజిత్ పవార్ ప్రమాణస్వీకారం చేసిన విషయం విదితమే. వీరు ప్రమాణ స్వీకారం చేసిన మరుసటి రోజే బలపరీక్ష నిరూపించుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో శరద్ పవార్ కుటుంబ సభ్యుల ఒత్తిడి మేరకు అజిత్ పవార్ డిప్యూటీ సీఎం పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత సీఎం పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఫడ్నవీస్ ప్రకటించిన విష యం తెలిసిందే. అనంతరం మహా వికాస్ అగాడి నేతృత్వంలో శివసేన చీఫ్ ఉద్ధవ్ థాకరే మహారాష్ట్ర సీఎంగా బాధ్యతలు స్వీకరించారు.

# యూపీలో మహిళల రక్షణకు పోలీసుల చర్యలు

**రాత్రివేళ ఒంటరి మహిళలకు ఎస్కార్ట్**

లక్నో,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): ఉత్తరప్రదేశ్‌లో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు అడ్డుకట్ట వేసేందుకు ఆ రాష్ట్ర పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఒంటరిగా వెళ్లే మహిళలకు పోలీసులు ఎస్కార్ట్ ఇవ్వనున్నారు. తామున్న ప్రదేశం నుంచి చేరుకోవాల్సిన గమ్యస్థానానికి ఒంటరిగా వెళ్లే మహిళలకు మాత్రమే ఎస్కార్ట్ ఇవ్వనున్నట్లు యూపీ డీజీపీ ఓపీ సింగ్ స్పష్టం చేశారు. ఈ మేరకు యూపీలోని అన్ని పోలీసు స్టేషన్లకు ఉత్తర్వులు జారీ చేశారు. 112కు డయల్ చేస్తే పోలీసు రెస్పాన్స్ వెహికిల్స్(పీఆర్వీ)కు సమాచారం అందుతుందని.. ఆ తర్వాత సదరు మహిళ వివరాలు చెప్తే అక్కడ్నుంచి ఎస్కార్ట్ ఇస్తారని తెలిపారు. ఇక ఎస్కార్ట్‌లో ఇద్దరు మహిళా పోలీసులు ఉండేలా చర్యలు తీసుకోవాలని డీజీపీ ఆదేశాలు జారీ చేశారు. దీనిపై మహిళా పోలీసులకు శిక్షణ ఇవ్వనున్నారు పోలీసు ఉన్నతాధికారులు. గత వారం యూపీలోని ప్రైవేటు కంపెనీలతో డీజీపీ సమావేశమై మహిళా ఉద్యోగినుల భద్రతపై చర్చించారు. మహిళా ఉద్యోగినుల సురక్షిత ప్రయాణానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని ప్రైవేటు కంపెనీలకు డీజీపీ ఆదేశాలు జారీ చేశారు.

# చెత్త సేకరణకు గ్రామాల వారీగా ప్రణాళికలు: కలెక్టర్

కొత్తగూడెం,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): ఇంకుడు గుంతలు, డంపింగ్ యార్డు, శ్మశాన వాటికల నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ రజత్‌కుమార్ శైనీ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నిర్మాణాల ప్రగతిని పర్యవేక్షించనున్నట్లు స్పష్టం చేశారు. ఇంటి నుంచి చెత్త సేకరణకు గ్రామాల వారీగా ప్రణాళికలు రూపొందించాలన్నారు.

ప్రణాళిక ప్రకారం ఆయా గ్రామాల్లో వ్యర్థాల సేకరణకు పంచాయతీ సిబ్బంది వస్తారనే సమాచారాన్ని ప్రజలకు తెలపాలని, చెత్తను పొడి, తడి చెత్తగా వేరు చేసి గ్రామ పంచాయతీ సిబ్బందికి అందజేయాలన్నారు. గ్రామాలు స్వచ్ఛతను సంతరించుకోవాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యర్థాలను సిబ్బందికి అందజేయాలన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేశామని, ఈ నెల 15లోగా నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. చేపట్టిన ఇంకుడు గుంతలు నిర్మాణాలు, డంపింగ్ యార్డు, శ్మశాన వాటికల నిర్మాణ పనులను ఎంపీడీవోలను అడిగి తెలుసుకున్నారు. హరితహారం లో రెడేళ్లలో నాటిన మొక్కలను పరిశీలించిచనిపోయిన మొక్కల స్థానంలో తిరిగి మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే ఏడాది నిర్వహించే హరితహారంలో మొక్కలు నాటేందుకు నర్సరీలో మొక్కలు పెంచాలన్నారు.

# టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

**అధికారులకు కలెక్టర్ సూచన**

జగిత్యాల,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు టెన్త్ ఉత్తీర్ణతలో ముందుండాలని కలెక్టర్ వరత్ అన్నారు. ఈ ఏడాది పరీక్షల్లో మంచిఫలితాలు రాబట్టాలని డిఇవోకు సూచించారు. విద్యార్థులు ఎలా చదువుతున్నారనీ, ఉపాధ్యాయులు పాఠాలు ఎలా బోధిస్తున్నారనీ, విద్యార్థులు ఇంటికి ఎప్పుడు వస్తున్నారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి పరీక్షల్లో రాష్ట్రంలోనే జగిత్యాల జిల్లా మూడుసార్లు ముందంజలో నిలిచిందని పేర్కొన్నారు. జిల్లాలో ఉత్తేజం కార్యక్ర మం మూడేళ్ల నుంచి నిర్వహిస్తున్నామనీ, పదో తరగతి విద్యార్థులకు స్కూల్ ప్రారంభానికి ఒక గంట ముందు, స్కూల్ అనంతరం ఒక గంట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తున్నారనీ, దీని కోసం విద్యార్థులకు ఉదయం, సాయంత్రం స్నాక్స్ ఇస్తు న్నారని తెలిపారు.

ఉత్తేజం కార్యక్రమానికి కావాల్సిన డబ్బును దాతల నుంచి లేదా విద్యార్థుల తల్లిదండ్రులైనా ఇవ్వవచ్చని తెలిపారు. ప్రతి పాఠశాలలో ప్రణాళికా ప్రకారం విద్యార్థులకు విద్యనందించడంతోపాటు దాతలు ఇచ్చిన డబ్బు బ్యాంక్‌లో జమ చేసి విద్యార్థులకు మాత్రమే ఖర్చు చేస్తారని తెలిపారు.

# రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ సమస్యలకు సత్వర పరిష్కారం



హైదరాబాద్, డిసెంబర్: 10:తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేసుకొని దళిత, గిరిజన సంక్షేమానికి, వారి సమస్యల సత్వర పరిష్కారానికి సీఎం కేసీఆర్ గారు కృషి చేస్తున్నారని మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లాలోని ఎస్సి, ఎస్టీ కేసుల పరిష్కారంపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈ రోజు కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీ- శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు విద్యాసాగర్, రామ్ బాల్ నాయక్, జడ్పీ చైర్ పర్సన్ కుమారి అంగోతు బిందు, ఎమ్మెల్యే శంకర్ నాయక్, ఎస్పీ కోటిరెడ్డి, జాయింట్ కలెక్టర్ డేవిడ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, సభ్యులు అన్ని జిల్లాలు పర్యటిస్తూ కేసులను సమీక్షిస్తు వారికి న్యాయం చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీలపై వివక్ష ఉండకూడదు, ఉంటే వారికి శిక్ష ఉంటుందని ఈ కమిషన్ హామీ ఇస్తోంది. కమిషన్ ఆదేశాలపై తక్షణమే పోలీసులు, అధికారులు స్పందించాలి.

కేసులో ఉన్న నిజానిజాలను చూసి దళితులు, గిరిజనులకు న్యాయం జరిగేలా కమిషన్ పని చేస్తుంది. సత్వర న్యాయం చేయడంలో ఇంకా ఏమైనా లోపాలుంటే సవరించుకొని ముందుకు వెళ్లే ఉద్దేశ్యంతో సమీక్ష చేసుకుంటున్నాం. ఈ సమీక్షలో పెండింగ్ కేసుల సత్వర పరిష్కరం కోసం, ఈ వర్గాలకు ఒక రక్షణ కవచం వలే కమిషన్ పని చేస్తుందని భరోసా ఇస్తుందని ఆశిస్తున్నాను.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ... 2018 జనవరి 2వ తేదీన కమిషన్ ఏర్పాటు అయింది. గతంలో కమిషన్ ఆంధ్రాకి పరిమితంగా ఉండే. సమైక్య రాష్ట్రంలో ముఖ్యమైన పదవులు ఆంధ్రావారికి ఇచ్చేవారు. కానీ ఇప్పుడు మేము వచ్చిన తర్వాత 10800 కేసులు పెండింగ్ ఉంటే 6000 కేసుల్లో దాదాపు 40 కోట్ల రూపాయలు నష్ట పరిహారం ఇప్పించాము. ఈ కమిషన్ ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేస్తుంది. మేము జిల్లాకు సంబంధించిన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, నాయకులు అధికారుల లేకుండా సమీక్ష చేయడం లేదు. ఈ విధంగా అందరిని భాగస్వామ్యం చేయడం వల్ల కొత్త ఒరవడి ప్రారంభించాము.

దీనివల్ల మంచి ఫలితాలు కూడా వస్తున్నాయి. బాధితుల సమస్యలు సత్వర పరిష్కారానికి ఉపయోగపడుతుంది. ఇతర ఏ రాష్ట్రంలో ఈ విధానం లేదు. అందుకే మన రాష్ట్ర కమిషన్ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా, మార్గదర్శకంగా ఉంటోంది. ఎస్టీ జనాభా అత్యధికంగా ఉన్న మహబూబాబాద్ జిల్లాలో ఈ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల కోసం అమలు చేస్తున్న పథకాల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలి. ప్రభుత్వ పథకాలలో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన నిధులను, పథకాలను వారికి పూర్తి స్థాయిలో అందేలా పని చేయాలన్నారని తెలిపారు

## చంద్రయ్య భార్యకు ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా చూస్తాం: కలెక్టర్

మేడ్చల్, డిసెంబర్ 10: చికిత్స పొందుతూ మృతి చెందిన అబ్దుల్లాపూర్‌మెట్టు తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే చంద్రయ్య భార్య పద్మకు మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ రెవెన్యూ శాఖ ఉద్యోగుల తరపున రూ. 1లక్ష చెక్కును జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎంవీ రెడ్డి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తహసీల్దార్ విజయారెడ్డి ప్రాణాలు కాపాడే తరుణంలో అటెండర్ చంద్రయ్య ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని అన్నారు. చంద్రయ్య భార్య పద్మమ్మకు ప్రభుత్వ ఉద్యోగం అందెలా చర్యలు తీసకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విద్యాసాగర్, డీఆరోఓ మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు. అబ్దుల్లాపూర్ మెట్ తహసీల్దార్ విజయారెడ్డిన సురేష్ అనే రైతు పెట్రోల్ పోసి, నిప్పంటించగా.. ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనలో తహసీల్దార్ సహా నలుగురు మరణించారు.

## కస్తూర్బా పాఠశాలలో స్పీకర్ ఆకస్మిక తనిఖీ

**సమస్యలు అడిగి తెలుసుకున్న పోచారం**

కామారెడ్డి,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): జిల్లాలోని బాన్సువాడ మండలంలోని కొత్తాబాది కస్తూర్బా పాఠశాలలో శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆకస్మిక తనిఖీలు చేశారు. పాఠశాల ఆవరణలో కలియదిరుగుతూ పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించిన స్పీకర్.. పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సమయానికి పాఠశాలకు వస్తున్నారా.. అని విద్యార్థులను అడిగారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు బుద్ధిగా వినాలన్న స్పీకర్.. చదువులో రాణించాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉత్తమ విద్యార్థులుగా తయారవ్వాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్పీకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు కూడా ముఖ్యమని స్పీకర్ పోచారం అన్నారు. యువత ఫిజికల్ ఫిట్‌నెస్‌పై దృష్టిసారించాలన్నారు.

# భూపాలపల్లి జిల్లాలో గవర్నర్ పర్యటన

**జనరిక్ మందుల షాపు ప్రారంభం**
**గిరిజనుల స్వాగతానికి తమిళిసై ఫిదా**

జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్10(ఆర్ఎన్ఎ): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ మంగళవారం పర్యటించారు. పర్యటనలో భాగంగా భూపాలపల్లిలో జనరిక్ మందుల దుకాణాన్ని గవర్నర్ ప్రారంభించారు .ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు అనిర్వచనీయమనీ.. ఆ సంస్థ గురించి ఎంత చెప్పినా తక్కువేనని తమిళిసై సౌందర్‌రాజన్ పేర్కొన్నారు.రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కేంద్రంలో జనరిక్ మెడికల్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంఅభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాటాడుతూ.. దశాబ్దాల కాలం నుంచి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సమాజానికి చేస్తున్న సేవ చాలా గొప్పదన్నారు. అనంతరం కాటారం మండలం బోడగూడెంను గవర్నర్ సందర్శించారు. డప్పు వాయిద్యాలు, గిరిజన సంప్రదాయ నృత్యాలను గవర్నర్‌కు గిరిజనులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బోడగూడెంలో గిరిజనులతో గవర్నర్ తమిళిసై మాట్లాడారు. గిరిజనుల సమస్యలు, వారి జీవన స్థితిగతులను గవర్నర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. గవర్నర్‌గా కాదు మీ సోదరిగా బోడగూడెం వచ్చాను. బోడగూడెం గ్రామస్థులను కలుసుకోవడం ఆనందంగా ఉంది. ఆదివాసీలు నాపై చూపించిన అభిమానం నన్ను కదిలించింది. రాజ్‌భవన్‌కు రావాల్సిందిగా మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాను. డబుల్ బెడ్‌రూం ఇండ్లు, సాగు చేసేందుకు భూమి కావాలని కోరారు. అందరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలి. మీ సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తాను అని గవర్నర్ తమిళిసై పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు, ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి, జిల్లా కలెక్టర్ వాసం వేంకటేశ్వర్లు, ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

# కూరగాయల సాగును పెంచండి

**- ఉల్లిసాగుకు ప్రోత్సాహం అందించండి**
**- సీసీఐ కొనుగోలు కేంద్రాలలో అవకతవకలు జరగొద్దు**
**- అధికారులను ఆదేశించిన మంత్రి నిరంజన్‌రెడ్డి**

మెదక్, డిసెంబర్10(నేటినిజం ప్రతినిధి) : తెలంగాణలో కూరగాయల సాగును మరింత పెంచాల్సిన అవసరం ఉందని, అలాగే ఉల్లిసాగును కూడా ప్రోత్సహించాలని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అధికారులకు సూచించారు. నారాయణఖేడ్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసన సభ్యుడు భూపాల్‌రెడ్డితో కలిసి ఉద్యానవనశాఖ ఉన్నతాధికారులతో మంత్రి నిరంజన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉల్లి పంట ప్రోత్సాహానికి ప్రభుత్వ సబ్సిడీ విత్తనం అందించే యోచనలో ఉన్నట్లు తెలిపారు. తెలంగాణలో ఉల్లిదిగుబడి తక్కువగా ఉండడం, ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవడం వల్ల ధరలు పెరుగుతున్నాయని, రాష్ట్రంలోనూ ఉల్లిరైతులను ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉల్లిపండించే రైతులకు ప్రభుత్వం సబ్సిడీ విత్తనం అందించే ఆలోచన ఉందని మంత్రి పేర్కొన్నారు. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం నుంచి ఒక ధరలను నిర్ణయించాలని కూడా భిస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో కూరగాయల ఉత్పత్తిని బాగాపెంచడం వల్ల ధరలు తగ్గే అవకాశం ఉందన్నారు. ఎండాకాలంలో రైతులు తప్పనిసరిగా కూరగాయలు పండించేలా చర్యలు తీసుకోవాలని కూడా అధికారులను ఆదేశించారు. రైతులు వేసిన పెసరపంటను వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ధారించాలని కోరారు. కిచెన్‌గార్డ్ ట్రైలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పందిరి కూరగాయల సాగుకు 90శాతం సబ్సిడీ ఇస్తామని అన్నారు. అర ఎకరా నుంచి ఎకరా వరకు పందిళ్లు వేసుకునేందుకు అనుమతితో పాటు సబ్సిడీని వర్తింప చేస్తామన్నారు. ఎరువులు, రసాయనాల వాడకం పై రైతులను చైతన్యం చేయాలని కూడా అధికారులను ఆదేశించారు. వరికి ఎకరాకు 40కిలోల యూరియాకు మించి వాడకూడదన్నారు. అనంతరం నారాయణఖేడ్ మండలం ఆకుల లింగాపూర్‌లో ఐకేపీ ధాన్యంకొనుగోలు కేంద్రం సందర్శించి రైతులకు మద్దతు ధర వచ్చేలా సహకరించాలని, తూకాల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

## రాగితీగ చోరీల ముఠా అరెస్ట్

ఆదిలాబాద్,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి రాగితీగను దొంగలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఆరుగురు సభ్యుల ముఠాను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ విష్ణువారియర్ తెలిపారు. నిందితుల నుంచి రూ.5.65 లక్షల విలువైన రాగి తీగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు మహారాష్ట్రలో నిందితులు చోరీలకు పాల్పడినట్లు ఎస్పీ వెల్లడించారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.